సాక్షి
అనంతపురం
శుక్రవారం । 3 । మే । 2024



చీనీ టన్ను రూ.36 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.36 వేలు పలికాయి.



విత్తన నాణ్యతకు పెద్దపీట

అన్నదాతల ప్రయోజనాలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేస్తోంది.

8లో

గరిష్టం/కనిష్టం
45.5°/27.1°

జిల్లాలో గత రికార్డులు తిరగరాసేలా గురువారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వర్షం కోసం వేయికళ్లతో జనం ఎదురు చూస్తున్న పరిస్థితి నెలకొంది.

న్యూస్‌రీల్

పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు



యల్లనూరు మండలం నీర్జాంపల్లి పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

నార్పల/యల్లనూరు/పుట్లూరు: పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వి.వినోద్ కుమార్ అన్నారు. గురువారం నార్పల, యల్లనూరు, పుట్లూరు మండలాల్లో పలు పోలింగ్ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలింగ్ రోజు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలన్నారు. సమస్యలను ముందుగానే గుర్తించి పరిష్కరించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలన్నారు. ఓటర్లు ఇబ్బంది పడకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు లక్ష్మీనారాయణ, జయ ప్రసాద్, సీఐలు శ్రీధర్, సుబ్రహ్మణ్యం, ఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ దస్తగిరి, ఈఓఆర్డీ రాముడు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్

అనంతపురం ఎడ్యుకేషన్: ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ సేవలు ఇకపై ఆన్‌లైన్‌లోనే అందుబాటులో ఉంటాయని జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎ.కళ్యాణి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. గతంలో ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్, రెన్యూవల్, అదనపు విద్యార్హతలు చేసేందుకు నేరుగా కార్యాలయానికి వచ్చి ఇబ్బంది పడకుండా ఇంటి నుంచే సులభంగా పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఇతర కోర్సులు చేసిన వారు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన వెంటనే లాగిన్ వివరాలు, రిజిస్ట్రేషన్ నంబరు ఎస్ఎంఎస్ ద్వారా, ఎంప్లాయిమెంట్ కార్డు లాగిన్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించిందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కళ్యాణి విజ్ఞప్తి చేశారు.

రేపు హిందూపురానికి సీఎం జగన్



- 11 గంటలకు హిందూపురం అంబేడ్కర్ సర్కిల్‌లో బహిరంగ సభ
- హెలిప్యాడ్ కోసం స్థల పరిశీలన చేసిన ఎస్పీ మాధవరెడ్డి, జేసీ అభిషేక్ కుమార్

సాక్షి, పుట్టపర్తి

ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 4వ తేదీ (శనివారం) జిల్లాకు రానున్నారు. ఉదయం 11 గంటలకు హిందూపురంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో నిర్వహించనున్న బహిరంగ సభలో మాట్లాడనున్నారు. ఇందుకోసం వైఎస్సార్ సీపీ నేతలు ఇప్పటికే ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతిపక్షాల వెన్నులో వణుకుపుట్టేలా సీఎం సభ ఉండాలని నేతలు భావిస్తున్నారు. సీఎం వైఎస్ జగన్ సభను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బి.నవీన్‌నిశ్చల్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం ఉదయం సీఎం జగన్ గన్నవరం విమానాశ్రయం నుంచి విమానంలో పుట్టపర్తిలోని శ్రీసత్యసాయి విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో హిందూపురానికి వెళ్తారు. అక్కడ సభ అనంతరం హెలికాప్టర్‌లో పలమనేరుకు చేరుకుని బహిరంగ సభలో పాల్గొననున్నారు.

సీఎం హెలిప్యాడ్ కోసం స్థల పరిశీలన..

హిందూపురం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో గురువారం సాయంత్రం ఎస్పీ మాధవరెడ్డి, జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ హెలిప్యాడ్ ఏర్పాటు కోసం ఎంజీఎం గ్రౌండ్‌ను పరిశీలించారు. ఎస్‌డీజీఎస్ కళాశాల గ్రౌండ్‌ను కూడా పరిశీలించి హెలిప్యాడ్ ఎక్కడ ఏర్పాటు చేయాలన్న దానిపై ఓ నిర్ణయం తీసుకోనున్నారు. అధికారుల వెంట వైఎస్సార్ సీపీ నాయకులు గుడ్డంపల్లి వేణురెడ్డి, కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, కొటిపి హనుమంతరెడ్డి, కొల్లకుంట ఆనంద్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



హిందూపురంలోని ఎంజీఎం గ్రౌండ్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి, జేసీ అభిషేక్‌కుమార్

ప్రశాంత నగరి..'పచ్చ' గూండాగిరి

- అనంతపురంలో అరాచక సంస్కృతికి నాంది పలికిన టీడీపీ
- పోలింగ్ సమీపిస్తున్న కొద్దీ బరితెగింపు
- అందులో భాగంగానే వైఎస్సార్ సీపీ నాయకుడు గుజ్జల నగేష్‌పై హత్యాయత్నం
- ప్రధాన నిందితుడు టీడీపీ అభ్యర్థి దగ్గుపాటి ప్రసాద్ అనుచరుడు
- నేర ప్రవృత్తి గల వ్యక్తికి టికెట్ ఇచ్చిన చంద్రబాబుపై ప్రజల ఆగ్రహం



గుజ్జల నగేష్‌పై కర్రలతో దాడి చేస్తున్న టీడీపీ గూండాలు (ఫైల్)

అనంతపురం: అనంతపురం నగరం ప్రశాంతతకు మారు పేరు. గొడవలు, కక్షలు, కార్పణ్యాలకు తావులేని ప్రాంతం. అలాంటి నగరంలో అలజడులు రేపేందుకు టీడీపీ నాయకులు పన్నాగాలు పన్నుతున్నారు. కాలనీల్లో ప్రజల మధ్య చిచ్చు రాజేసి తద్వారా ఎన్నికల్లో లబ్ధి పొందాలనే ఎత్తుగడ వేస్తున్నారు.

ఆయనకు టికెట్‌తోనే బీజం..

రాప్తాడులో వైఎస్సార్‌సీపీ నేత భూమి రెడ్డి ప్రసాద్ రెడ్డి హత్య కేసులో నిందితుడైన దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్‌కు అనంతపురం టీడీపీ టికెట్ కేటాయించడంతోనే అరాచక సంస్కృతికి బీజం పడినట్లయింది. టికెట్ ఖరారైన క్షణం నుంచే దగ్గుపాటి చుట్టూ రౌడీ షీటర్లు, హింసా ప్రవృత్తి గల వారు చేరిపోయారు. ఏకంగా రౌడీషీటర్లతోనే దగ్గుపాటి ప్రసాద్ ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేందుకే ఆయన తన వెంట నేరస్తులను తీసుకెళ్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఉలిక్కిపడిన నగరం

రూరల్ పంచాయతీ పరిధిలో నాలుగు రోజుల క్రితం వైఎస్సార్‌సీపీ నేత గుజ్జల నగేష్‌పై హత్యాయత్నం జరిగింది. మారణాయుధాలతో కిరాతకంగా నగేష్‌పై దాడి చేశారు. పచ్చ మూకలు పట్టపగలే సాగించిన ఈ వికృత క్రీడ నగరాన్ని ఉలిక్కిపడేలా చేసింది. నగేష్‌ను కింద పడేసి కిరాతకంగా మారణాయుధాలతో దాడి చేస్తున్న వీడియో సోషల్‌మీడియాలో వైరలైంది.

ప్రధాన నిందితుడు దగ్గుపాటి అనుచరుడు..

నగేష్‌పై హత్యాయత్నం కేసులో ప్రధాన నిందితుడైన జయరాం నాయుడు.. టీడీపీ అభ్యర్థి దగ్గుపాటి ప్రసాద్ అనుచరుడు కావడం గమనార్హం. అనంతపురం రూరల్ పంచాయతీలో జయరాం నాయుడు భూ కబ్జాలకు అంతేలేదని ఆ ప్రాంతవాసులు చెబుతారు. పంచాయితీలు, దందాల్లో ఆరితేరిన వ్యక్తి అని తెలిపారు. ఈయనపై పోలీసుస్టేషన్లలో అనేక కేసులు నమోదు అయ్యాయి. తాజాగా వైఎస్సార్‌సీపీ నేత నగేష్‌పై జరిగిన హత్యాయత్నంలోనూ ఈయన కీలక పాత్ర పోషించినట్లు స్పష్టమైన ఆధారాలు కూడా లభించాయి. నగేష్‌పై కిరాతకంగా దాడి చేసిన నారాయణ స్వామి అలియాస్ పులితో జయరాం నాయుడు తరచూ ఫోన్‌లో మాట్లాడినట్లు కాల్ డేటా ద్వారా స్పష్టమైంది. దాడికి అర గంట ముందు ఫోన్‌పే ద్వారా రూ.5 వేల నగదును నారాయణ స్వామికి జయరాం నాయుడు పంపినట్లు వెల్లడైంది. అలాంటి వ్యక్తికి అనంతపురం టీడీపీ అభ్యర్థి దగ్గుపాటి ప్రసాద్ వంత పాడుతూ రెండు రోజుల క్రితం నగరంలో హల్‌చల్ చేయడంపై నగరవాసులు విస్మయం వ్యక్తం చేశారు. ఎన్నికల పోలింగ్ సమీపిస్తున్న నేపథ్యంలో మరెన్ని దారుణాలకు పచ్చ గూండాలు తెరలేపుతారోనని బిక్కుబిక్కుమంటున్నారు. నేర ప్రవృత్తి గల వ్యక్తికి టికెట్ కేటాయించి అరాచకాలకు తెరతీసిన టీడీపీ అధినేత చంద్రబాబుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



పచ్చ మూకల దాడిలో తీవ్రంగా గాయపడిన గుజ్జల నగేష్ (ఫైల్)

ఆయనవి నేర రాజకీయాలే!

టీడీపీ అభ్యర్థి దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ నేరస్తుడు, కబ్జాదారుడు అనే విమర్శలున్నాయి. రాప్తాడు మండలం ప్రసన్నాయపల్లి సర్వే నంబర్ 123/3లో తన సమీప బంధువు దగ్గుపాటి దీప్తి పేరు మీద మూడెకరాల వంక పోరంబోకు స్థలాన్ని కబ్జా చేశారనే ఆరోపణలున్నాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వైఎస్సార్ సీపీ నేత భూమిరెడ్డి శివప్రసాద్ రెడ్డిని రాప్తాడు తహసీల్దార్ కార్యాలయంలో దారుణంగా హత్య చేశారు. ఆ హత్య ఘటనలో అప్పట్లో రాప్తాడు ఎంపీపీగా ఉన్న దగ్గుపాటి ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలున్నాయి. రూ.25 లక్షల నగదు, స్కార్పియో వాహనం ఇచ్చి తన అన్నను దగ్గుపాటి హత్య చేయించాడని స్వయంగా ప్రసాద్ రెడ్డి సోదరుడు మహానంద రెడ్డి ఆరోపించారు. ఈ ఘటనపై పోలీసులు దగ్గుపాటిపై కేసు నమోదు చేయగా.. అప్పట్లో అధికార పార్టీ అండతో పేరు తొలగించుకోగా, తాము కోర్టుకు వెళ్లి తిరిగి చేర్పించామన్నారు. శివప్రసాద్ రెడ్డి హత్య కేసులో నిందితులుగా ఉన్న పంచగల శ్రీనివాసులు తదితర కరుడుగట్టిన నేరస్తులతో కలసి నేడు దగ్గుపాటి ఎన్నికల ప్రచారం చేస్తున్న ఫొటోలను కూడా ఆయన ఇటీవల విలేకరుల ఎదుట ప్రదర్శించారు. ప్రజలు విజ్ఞతతో ఆలోచించి ఇటువంటి వ్యక్తికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

పోస్టల్ బ్యాలెట్‌కు 23,532 మంది దరఖాస్తు

- నిర్దేశించిన తేదీల్లో వెళ్లి ఓటు వేయాలి
- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వినోద్‌కుమార్



అనంతపురం అర్బన్: సార్వత్రిక ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ కోసం జిల్లావ్యాప్తంగా 23,532 మంది దరఖాస్తు చేసుకున్నట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వి.వినోద్‌కుమార్ వెల్లడించారు. నిర్దేశించిన తేదీల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఇందుకు సంబంధించి వివరాలను ఆయన గురువారం తెలియజేశారు. ఎన్నికల విధులకు నియమించిన పోలింగ్ అధికారులు, అసిస్టెంట్ పోలింగ్ అధికారులు, ఇతర పోలింగ్ అధికారులు, పోలీసు సిబ్బంది, సూక్ష్మ పరిశీలకులు, వీడియో గ్రాఫర్లు, అదేవిధంగా ఎన్నికల విధులకు హాజరయ్యే ప్రభుత్వేతర ఉద్యోగులు, డ్రైవర్లు, క్లీనర్లు, కండక్టర్లు, ఎన్నికల విధుల్లో పనిచేసే ఇతర అధికారులు, సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటింగ్ సదుపాయాన్ని ఎన్నికల కమిషన్ కల్పించిందన్నారు. ఓటు హక్కు వినియోగించుకునేందుకు నియోజకవర్గానికి రెండు ఫెసిలిటేషన్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అత్యవసర సేవల ఉద్యోగుల కోసం ఒక పోస్టల్ ఓటింగ్ కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల విధుల్లో ఉండే అధికారులు, సిబ్బంది, ప్రభుత్వేతర ఉద్యోగులు తాము ఓటరుగా ఎన్‌రోల్ అయిన అసెంబ్లీ నియోజకవర్గంలోని ఫెసిలిటేషన్ కేంద్రంలో, పోస్టల్ ఓటింగ్ కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే సౌకర్యం కల్పించామన్నారు.

- ఇతర జిల్లాలకు చెందిన ఉద్యోగులు,అధికారులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే సౌకర్యం కల్పించామని కలెక్టర్ చెప్పారు. వీరి కోసం జిల్లాస్థాయిలో ప్రత్యేకంగా ఫెసిలిటేషన్ కేంద్రం ఏర్పాటు చేశామన్నారు.

పోస్టల్ ఓటింగ్ తేదీలు

దరఖాస్తుదారులు	పోస్టల్ ఓటింగ్ ప్రారంభ తేదీ	ముగింపు తేదీ
పీఓ, ఏపీఓ, ఓపీఓ	03-05-2024	06-05-2024
డ్రైవర్లు, క్లీనర్లు, వీడియో గ్రాఫర్లు, తదితరులు	05-05-24	07-05-24
పోలీసు సిబ్బంది	06-05-24	08-05-2024
అత్యవసర సేవలందించే వారికి	08-05-2024	10-05-2024
జిల్లాస్థాయి ఫెసిలిటేషన్ కేంద్రం	04-05-2024	06-05-2024

ఫెసిలిటేషన్ కేంద్రాలు..

నియోజకవర్గం	ఫెసిలిటేషన్ కేంద్రం
రాయదుర్గం	ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆర్‌ఓ కార్యాలయం
ఉరవకొండ	శ్రీ కరిబసవేశ్వర ప్రభుత్వ ఉన్నత పాఠశాల
గుంతకల్లు	సర్వేపల్లి రాధాకృష్ణ మున్సిపల్ హైస్కూల్, ఆర్‌ఓ కార్యాలయం
తాడిపత్రి	ఏపీ మోడల్ స్కూల్, పప్పూరు రోడ్డు, ఆర్‌ఓ కార్యాలయం
శింగనమల	వినికిడి లోపం ఉన్న పిల్లల ఆర్‌డీటీ హైస్కూల్, సిద్ధరామపురం రోడ్డు, బీకేఎస్ మండలం, ఆర్‌ఓ కార్యాలయం
అనంతపురం అర్బన్	ప్రభుత్వ జూనియర్ కళాశాల, కొత్తూరు, పోస్టల్ ఓటింగ్ కేంద్రం డ్వామా సమావేశ మందిరం
కళ్యాణదుర్గం	ఎస్‌వీజీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఆర్‌ఓ కార్యాలయం
రాప్తాడు	టీటీడీసీ, సీఎల్‌ఆర్‌సీ భవనం, పంగల్ రోడ్డు, ఆర్‌ఓ కార్యాలయం
జిల్లా ఫెసిలిటేషన్ కేంద్రం	డ్వామా కార్యాలయం, అనంతపురం

స్వేచ్ఛగా ఓటు వేయండి : ఎస్పీ

అనంతపురం: ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎస్పీ అమిత్ బర్దర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సమస్యాత్మక ప్రాంతాల్లో గురువారం బీఎస్ఎఫ్, ఏపీఎస్పీ, స్పెషల్ పార్టీ పోలీసులతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఓటు హక్కును అర్హులైన ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. పారదర్శక, ప్రశాంత ఎన్నికలే లక్ష్యమని పేర్కొన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే పోలీసుల దృష్టికి తీసుకెళ్లి చట్టబద్ధంగా పరిష్కరించుకోవాలని సూచించారు. అంబేడ్కర్ కాలనీ వాసులకు ఓటు హక్కుపై చైతన్యం కలిగించారు. అనంతరం గౌసుల్ వారా వీధిలో ఉన్న మొరార్జీ మున్సిపల్ పాఠశాల పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. డీఎస్పీ జి.వీర రాఘవ రెడ్డి, బీఎస్ఎఫ్ అధికారి ధర్మేంద్రసింగ్, 14వ బెటాలియన్ డీఎస్పీ వెంకట రెడ్డి, సీఐలు రెడ్డప్ప, ధరణికిశోర్, నారాయణ రెడ్డి, జయంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బందోబస్తు పటిష్టంగా ఉండాలి

బుక్కరాయసముద్రం: సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎస్పీ అమిత్ బర్దర్ పేర్కొన్నారు. గురువారం బీకేఎస్, చెన్నంపల్లి, వెంకటాపురం, కేకే అగ్రహారం గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ అమిత్ బర్దర్ మాట్లాడుతూ సమస్యాత్మక గ్రామాలను తరచూ సందర్శించాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు. ప్రజలు గొడవలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

15 నుంచి శిక్షణ శిబిరాలు

అనంతపురం: జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో మే 15 నుంచి జూన్ 14 వరకు ఉచిత వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి షేక్ షఫీ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 58 శిక్షణా శిబిరాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 08554-315632 నంబరుకు సంప్రదించాలని కోరారు.

అభ్యర్థుల నేరచరిత్ర అఫిడవిట్ ప్రదర్శన

అనంతపురం అర్బన్: సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేయనున్న అభ్యర్థుల నేర చరిత్రకు సంబంధించిన అఫిడవిట్‌లు ఆన్‌లైన్‌తో పాటు ఆర్‌ఓ కార్యాలయాల నోటీసుబోర్డులో ప్రదర్శనకు ఉంచినట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వి.వినోద్‌కుమార్ తెలిపారు. నామినేషన్ల ప్రక్రియ ఈనెల 25తో ముగిసిందన్నారు. అనంతపురం పార్లమెంట్, ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు పోటీ చేయనున్న అభ్యర్థులు తమ నేరచరిత్రకు సంబంధించిన అఫిడవిట్ (ఫారం-26) సమర్పించారన్నారు. వీటిని ఏరోజుకారోజు ఎన్కోర్ (affidavit.eci.gov.in) వెబ్‌సైట్‌లో పొందుపర్చామన్నారు. అదే విధంగా రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లోని నోటీసు బోర్డులో ప్రదర్శనకు ఉంచారన్నారు.

రోజంతా ముచ్చెమటలు

- భానుడి భగభగలతో జనం బెంబేలు
- రాగల నాలుగు రోజులూ మరింత ఉష్ణతాపం

అనంతపురం అగ్రికల్చర్: తగ్గేదేలే అన్నట్లుగా సూరీడు ప్రతాపం చూపిస్తుండటంతో 'అనంత' అగ్నిగోళంలా మండుతోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతుండటం జనజీవనానికి ఇబ్బందిగా మారుతోంది. భానుడి భగభగలతో బెంబేలెత్తిపోతున్న పరిస్థితి నెలకొంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రికార్డు స్థాయిలో పగటి ఉష్ణోగ్రతలు 41 నుంచి 45 డిగ్రీలు, రాత్రిళ్లు 27 నుంచి 32 డిగ్రీలకు ఎగబాకుతున్నాయి. గాలిలో తేమ ఉదయం 40 నుంచి 45 శాతం, మధ్యాహ్న సమయంలో 20 శాతానికి పడిపోతోంది. 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో వీస్తున్న వడగాల్పులు జనానికి ముచ్చెమటలు పట్టిస్తున్నాయి.

రాగల నాలుగు రోజులు మరింత వేడి..

రాగల నాలుగు రోజులు ఇలాగే ఉష్ణతాపం కొనసాగే అవకాశం ఉందని రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ బి.సహదేవరెడ్డి, డాక్టర్ జి.నారాయణస్వామి తెలిపారు. భారత వాతావరణ శాఖ అందించిన సమాచారం మేరకు రాయలసీమ జిల్లాల పరిధిలో ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదవుతాయన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వడదెబ్బ బారి నుంచి తప్పించుకోవాలంటే మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లకపోవడం మంచిదని తెలిపారు.

క్లుప్తంగా

ట్రైనీ టెక్నీషియన్లుగా ఉద్యోగాలు

అనంతపురం ఎడ్యుకేషన్: నగరంలోని ఎంజీఎం స్ప్రింగ్స్‌లో ఖాళీగా ఉన్న ట్రైనీ టెక్నీషియన్ల పోస్టులకు ఈ నెల 6న ఉదయం 10 గంటలకు అనంతపురంలోని ప్రభుత్వ ఐటీఐలో జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ రామమూర్తి గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఫిట్టర్, టర్నర్, మెషినిస్ట్, డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్ ట్రేడుల్లో ఉత్తీర్ణులైన వారు అర్హులు. ఎంపికైన వారికి ఏడాది పాటు శిక్షణ ఉంటుంది. శిక్షణ సమయంలో మొదటి మూడు నెలలు రూ.10 వేలు, తర్వాత 9 నెలలు రూ.11 వేలు చొప్పున చెల్లిస్తారు. ఆ తర్వాత శాశ్వత ఉద్యోగం కల్పిస్తారు. పూర్తి వివరాలకు 96189 16029లో సంప్రదించవచ్చు.

గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

కదిరి అర్బన్: శ్రీసత్యసాయి జిల్లా కదిరిలోని అడపాలవీధిలో ఉన్న గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో ప్రవేశానికి ఈనెల 20లోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ మురళీ శ్రీనివాస్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇంగ్లిష్ మీడియం 3వ తరగతిలో 40 సీట్లు ఉన్నాయని, ఇందులో ఎస్టీ 32,ఎస్సీ 5, బీసీ 02, ఓసీ 01, 4వ తరగతిలో 28 సీట్లు, 5వ తరగతిలో 7 సీట్లు, 9వ తరగతిలో 2 సీట్లు కేవలం ఎస్టీ విద్యార్థులకు మాత్రమే ఉన్నాయని తెలిపారు. మరిన్ని వివరాలకు 9441059189 నంబరులో సంప్రదించాలని కోరారు.

విత్తన నాణ్యతకు పెద్దపీట

- ఉమ్మడి జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో అందుబాటులోకి వ్యవసాయ ప్రయోగశాలలు
- రూ.11.70 కోట్లతో అధునాతన సాంకేతిక ల్యాబ్‌ల నిర్మాణం
- రైతుల ముంగిటకే నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, ఇతర ఇన్‌పుట్స్


గుత్తిలో ఏర్పాటు చేసిన అగ్రికల్చర్ ల్యాబ్


వేరు చేసిన నాసిరకం విత్తన కాయలు

అనంతపురం అగ్రికల్చర్: వ్యవసాయం లాభసాటి కావాలంటే రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, ఇతర ఇన్‌పుట్లను అందజేయాలనే సమున్నత ఆశయంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలోనూ 'ఇంటిగ్రేటెడ్ అగ్రికల్చర్ ల్యాబ్స్' ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. కల్తీ, నాసిరకం ఉత్పత్తులకు చెక్ పెట్టడానికి వీలుగా 'వైఎస్సార్ అగ్రి ల్యాబ్స్' శరవేగంగా అందుబాటులోకి తెచ్చారు. అధునాతన సాంకేతిక పద్ధతిలో ఏర్పాటు చేసిన ఒక్కో ల్యాబ్‌కు రూ.97.50 లక్షలు ఖర్చు చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే 12 నియోజక వర్గాల పరిధిలో వ్యవసాయ ప్రయోగశాలలు పనిచేస్తున్నాయి. అనంతపురం జిల్లా కేంద్రంలో జిల్లా స్థాయి ప్రయోగశాల ఏర్పాటు చేశారు. ప్రస్తుతం రాప్తాడు మినహా మిగిలిన నియోజకవర్గాల్లో అగ్రి ల్యాబ్స్ అందుబాటులోకి వచ్చాయి. అనంతపురం జిల్లా స్థాయి ల్యాబ్ పరిధిలో రాప్తాడుకు సంబంధించి పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రతి ల్యాబ్‌లో ఓ టెక్నికల్ ఏఓ, ఇద్దరు ఏఈఓలు, మరొక అసిస్టెంట్‌ను కేటాయించారు. 12 ప్రయోగశాలల నిర్మాణానికి రూ.11.70 కోట్లు బడ్జెట్ ఖర్చు చేయగా, నియోజక వర్గ, జిల్లా స్థాయితో పాటు విశాఖపట్నం, ఏలూరు, గుంటూరు, తిరుపతిలో ప్రాంతీయ స్థాయి ప్రయోగశాలలు ఏర్పాటు చేశారు. ఎప్పటికప్పుడు విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల నమూనాలు రైతులు, దుకాణాదారులు, కంపెనీల నుంచి సేకరించి వాటి నాణ్యతను పరీక్షిస్తున్నారు. ప్రధానంగా మొలకశాతం, తేమశాతం, ఫిజికల్ ప్యూరిటీ అలాగే ఎన్–పీ–కే పోషకాల శాతం, జింక్, బోరాన్, మెగ్నీషియం లాంటి సూక్ష్మపోషకాల శాతాన్ని పరీక్షిస్తున్నారు. అలాగే పురుగు మందులు, బయో ఉత్పత్తులు, సేంద్రియ ఉత్పత్తులు, మట్టి, నీరు పరీక్షలు కూడా చేస్తూ కల్తీ, నాసిరకానికి అడ్డుకట్ట వేస్తున్నారు.

అప్పట్లో నాసిరకంతో నష్టాలపాలు..

నాణ్యతా ప్రమాణాలు తెలుసుకునే సాంకేతిక పరిజ్ఞానం, అధునాతన ప్రయోగశాలలు అందుబాటులో లేని రోజుల్లో బహిరంగ మార్కెట్‌లో నాసిరకం, కల్తీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు హల్‌చల్ చేశాయి. 2014–19 మధ్య ఐదేళ్ల కాలంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం అందించిన విత్తనాలకు సంబంధించి 70కు పైగా నమూనాలు సేకరించిన అధికారులు పరీక్షల అనంతరం అవి నాసిరకమని తేల్చారు. అలాగే 45 వరకు ఎరువుల నమూనాలు, 60కు పైగా పురుగు మందుల నమూనాలు కూడా నాణ్యతగా లేవని తేల్చారు. ఇలాంటి ఉత్పత్తులతో పంటల సాగు చేపట్టిన రైతులు భారీగా నష్టపోయారు. ఇందుకు సంబంధించి అక్కడక్కడ కొన్ని కేసులు నమోదవుతున్నా... నిబంధనల్లో ఉన్న లొసుగులను ఆసరా చేసుకుని కంపెనీలు, డిస్ట్రిబ్యూటర్లు, దుకాణాదారులు గట్టెక్కుతున్నారు. పంట సాగు చేసిన రైతుకు మాత్రం అన్యాయం జరుగుతోంది. ఈ విషయాన్ని గుర్తించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి... విత్తన వరి, వేరుశనగ, పప్పుశనగ, కందులు, అలాగే పండ్లు, కూరగాయలు, కర్బూజా, కళింగర లాంటి ఉద్యానతోటలకు సంబంధించి విత్తనాలు కూడా నాణ్యమైన సరఫరా చేసేలా పటిష్ట చర్యలు తీసుకున్నారు.

బార్ అసోసియేషన్ ఎన్నికలకు నామినేషన్ల దాఖలు


నామినేషన్ దాఖలు చేస్తున్న దృశ్యం

అనంతపురం: బార్ అసోసియేషన్ ఎన్నికలు ఈ నెల 9న నిర్వహించనున్నారు. అదే రోజు కౌంటింగ్, ఫలితాల ప్రకటన ఉంటుంది. ఈ క్రమంలో నామినేషన్ల దాఖలు ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. తొలి రోజే అధ్యక్ష స్థానానికి సీనియర్ న్యాయవాదులు బడా నారాయణరెడ్డి, సుబ్రహ్మణ్యం, గురుప్రసాద్ నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల దాఖలుకు శుక్రవారం చివరి గడువుగా నిర్దేశించారు. అలాగే 4వ తేదీన నామినేషన్ల విత్‌డ్రా, 9న పోలింగ్ ఉంటుంది. ఎన్నికల అధికారులుగా వీజే రవి కుమార్, వి.రాజశేఖర్, ఆర్ఎల్ నరసింహ వరప్రసాద్ వ్యవహరించనున్నారు.

బిడ్డకు విషమిచ్చి తల్లి ఆత్మహత్యాయత్నం

బొమ్మనహాళ్: తాను చనిపోతే తన బిడ్డ బాగోగులు చూస్తారో లేదోనన్న ఆవేదనతో క్షణికావేశానికి లోనైన ఓ తల్లి తన బిడ్డకు విషమిచ్చి తానూ తాగింది. చికిత్స పొందుతూ చిన్నారి మృతి చెందాడు. తల్లి పరిస్థితి విషమంగా ఉంది. ఆలస్యంగా వెలుగు చూసిన ఘటనకు సంబంధించి వివరాలు... బొమ్మనహాళ్ మండలం కల్లుదేవనహళ్లి గ్రామానికి చెందిన చాకలి తిప్పయ్య కుమార్తె అశ్విని (23)కి ఆరేళ్ల క్రితం డి.హీరేహాళ్ మండలం మురిడి గ్రామానికి చెందిన చాకలి రామాంజినేయులుతో వివాహమైంది. వీరికి 18 నెలల వయసున్న కుమారుడు శశాంత్ ఉన్నాడు. కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్న అశ్వనికి కుటుంబసభ్యులు చికిత్స చేయిస్తున్నారు. అయినా నయం కాకపోవడంతో తీవ్ర మనస్తాపం చెందిన ఆమె ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుంది. ఈ క్రమంలో తాను చనిపోతే తన కుమారుడి బాగోగులు పట్టించుకుంటారో లేదోననే అనుమానాలు ఆమెను తీవ్రంగా కలచి వేశాయి. దీంతో గత నెల 30న ఇంట్లో ఎవరూ లేని సమయంలో కుమారుడికి విషమిచ్చి, తానూ పురుగుల మందు తాగింది. ఆలస్యంగా ఈ విషయాన్ని గుర్తించిన కుటుంబసభ్యులు వెంటనే వారిని బళ్లారిలోని విమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం శశాంత్ మృతి చెందాడు. అశ్విని పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

జనం లేక 'కాలవ' బేజారు!

కణేకల్లు: మండలంలోని బ్రహ్మసముద్రంలో టీడీపీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులు గురువారం సాయంత్రం చేపటిన ఎన్నికల ప్రచారం ఆయనకు తీవ్ర నిరాశ మిగిల్చింది. దీంతో అసహనం వ్యక్తం చేస్తూ అర్ధంతరంగా వెనక్కి వెళ్లిపోయారు. వివరాలు.. బ్రహ్మసముద్రంలో అత్యధిక మంది వైఎస్సార్‌సీపీ మద్దతుదారులే ఉన్నారు. ఈ క్రమంలో తన ఎన్నికల ప్రచారాన్ని కొంత మేరైనా విజయవంతం చేసి తమ పరువు దక్కించుకోవాలని టీడీపీ నేతలు ప్రయత్నాలు చేశారు. దీంతో బుధవారం జరగాల్సిన కాలవ శ్రీనివాసులు రోడ్డు షోకు జనాల్లో స్పందన ఉండదని గుర్తించి, గ్రామంలో సంత జరిగే గురువారానికి బదలాయించారు. సంతకు ప్రధాన రహదారి కిక్కిరిస్తుంది. దీనికి తోడు చుట్టుపక్కల గ్రామాల వారు కూడా వస్తారు. దీంతో కాలవ రోడ్డు షో విజయవంతమవుతుందని అందరూ భావించారు. అనుకున్నట్లుగానే గురువారం సాయంత్రం 5.30 గంటలకు కాలవ రోడ్‌షో ప్రారంభించారు. అయితే స్థానికులెవరూ పాల్గొనలేదు. బయట గ్రామాల నుంచి వచ్చిన కార్యకర్తలే ఉన్నారు. ఈ విషయాన్ని గుర్తించిన కాలవ అసహనానికి గురయ్యారు. అర్ధంతరంగా తన రోడ్డు షోను ముగించుకుని వచ్చిన దారినే ఆయన కణేకల్లుకు వెళ్లిపోయారు.

కూల్‌డ్రింక్స్ లారీ బోల్తా


లారీ బోల్తాపడటంతో కిందపడిపోయిన కూల్‌డ్రింక్స్ బాటిళ్లు

చిలమత్తూరు: కూల్‌డ్రింక్స్ లోడుతో వెళ్తున్న లారీ అదుపుతప్పి బోల్తా పడిన ఘటన చిలమత్తూరు మండలం కనిశెట్టిపల్లి వద్ద గురువారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ నుంచి మ్యాంగో స్లైస్ కూల్‌డ్రింక్స్ లోడుతో తమిళనాడు రాష్ట్రం హొసూర్‌కు వెళ్తున్న లారీ కనిశెట్టిపల్లి వద్ద 44వ జాతీయరహదారిపై అదుపుతప్పి బోల్తాపడింది. గాయపడిన డ్రైవర్‌ను బాగేపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. లారీలోను, కింద పడిన కూల్‌డ్రింక్ బాటిళ్లను వాహనదారులు, స్థానికులు తీసుకెళ్లారు. పోలీసులు వచ్చేసరికి లారీలో సరుకంతా ఖాళీ అయిపోయింది.

పోలీసు కస్టడీకి బ్యాంకు మేనేజర్

అమడగూరు: వినియోగదారులకు తెలియకుండా వారి ఖాతాల్లోంచి నగదు అపహరించిన కేసులో అరెస్ట్ అయిన బ్యాంక్ మేనేజర్ (ఏపీజీబీ) పెంచలరెడ్డిని పోలీసులు విచారిస్తున్నారు. బ్యాంకు సీనియర్ మేనేజర్‌గా పని చేస్తూ ఖాతాదారులకు తెలియకుండా రూ 44.10 లక్షలను ఆయన స్వాహా చేశారన్న ఆరోపణలపై కేసు నమోదు చేసిన పోలీసులు గత నెల 28న చెన్నైలో నిందితుడిని అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. అనంతరం న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచిన పోలీసులు మూడు రోజుల పోలీసు కస్టడీ కింద తీసుకున్నారు. ఈ క్రమంలో గురువారం అమడగూరు పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చి బాధిత ఖాతాదారుల సమక్షంలో సీఐ రాజేంద్రనాథ్ యాదవ్, ఎస్‌ఐ మగ్బూల్‌బాషా విచారణ చేపట్టారు. ఇప్పటి వరకూ రూ.30 లక్షల వరకూ సొమ్ము తీసుకున్నట్లు వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు.

అంతిమ విజయం పేదలదే కావాలి

- పెత్తందారులు, పేదలకు మధ్య జరిగే యుద్ధమే ఈ ఎన్నికలు
- సొంత పంచాయతీని అభివృద్ధి చేయలేని అసమర్థుడు కేశవ్
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డి


ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వ, చిత్రంలో ఎంపీ గోరంట్ల మాధవ్, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

ఉరవకొండ: ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికలు పేదలు, పెత్తందారులకు మధ్య జరిగే యుద్ధం లాంటిదని, ఈ పోరులో అంతిమ విజయం పేదలదే కావాలని ఉరవకొండ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. టీడీపీ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ సొంత పంచాయతీ పరిధిలోని మైలారంపల్లి, రాజేపల్లి, వై.రాంపురం, కొకుంట్లలో గురువారం ఎంపీ గోరంట్లమాధవ్, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో వారికి అపూర్వ స్వాగతం లభించింది. మైలారంపల్లిలో జరిగిన రోడ్డు షోలో విశ్వ మాట్లాడారు. పెత్తందారి పోకడలతో కొకుంట్ల పంచాయతీని దశాబ్దాలుగా పయ్యావుల కేశవ్ తన గుప్పెట్లో పెట్టుకుని అభివృద్ధికి నోచుకోకుండా చేశాడని మండిపడ్డారు. కనీసం గ్రామాలకు రోడ్లు, తాగునీరు లాంటి మౌలికవసతులు కూడా కల్పించలేని అసమర్థుడికి ఈ ఎన్నికల్లో ఓటుతో తిరుగులేని సమాధానం చెప్పాలని పిలుపునిచ్చారు. ప్రతి ఎన్నికల్లోనూ ప్రజల ఓటు హక్కును హరిస్తూ రిగ్గింగ్‌లకు తెరలేపే పయ్యావుల సోదరుల తీరును ఈ ఎన్నికల్లో పటిష్ఠంగా ఎదుర్కొంటామన్నారు. ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఎంపీ గోరంట్ల మాధవ్ మాట్లాడుతూ... గత టీడీపీ ప్రభుత్వానికి, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో వ్యత్యాసాలను గమనించాలని కోరారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్ద పీట వేసిందన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ... ప్రజలకు మంచి చేసే సీఎం వైఎస్ జగనన్నకు అండగా నిలవాలని, ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ నరసింహులు, వైస్ ఎంపీపీ శ్రీనాథ్‌రెడ్డి, పార్టీ నాయకులు తేజోనాథ్, అశోక్, ముష్టూరు సుంకన్న, వాల్మీకి, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్లు రామాంజినేయులు, గోవిందు పాల్గొన్నారు.

రోబోటిక్ సర్జరీపై వైద్య విద్యార్థులకు అవగాహన



డాక్టర్ మహమ్మద్ షాహిద్‌ను సన్మానిస్తున్న దృశ్యం

అనంతపురం మెడికల్: ప్రభుత్వ వైద్య కళాశాలలో గురువారం రోబోటిక్ సర్జరీపై వైద్య విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రముఖ రోబోటిక్ సర్జన్ డాక్టర్ మహమ్మద్ షాహిద్ రోబోటిక్ సర్జరీ ద్వారా కలిగే ప్రయోజనాలను విపులంగా తెలియజేశారు. శస్త్రచికిత్సలు ఎంత సులభంగా చేయవచ్చో పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. వెన్నెముక, యురాలజీ, గైనకాలజీ, అన్ని రకాల కేన్సర్లుకు రోబోటిక్ పద్ధతి ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు మాట్లాడుతూ.. డాక్టర్ షాహిద్ వైద్య కళాశాల 2కె8 బ్యాచ్‌కు చెందిన విద్యార్థి అని, నారాయణ హృదయాలయలో జనరల్ సర్జరీ, హైదరాబాద్‌లోని ఏషియన్ గ్యాస్ట్రోఎంటరాలజీలో గ్యాస్ట్రోఎంటరాలజీ పూర్తి చేశారన్నారు. బేరియాట్రిక్ సర్జరీ, రోబోటిక్ సర్జరీలపై ఫెలోషిప్ పొంది విద్యనభ్యసించిన కళాశాలలోనే గెస్ట్ లెక్చర్ ఇవ్వడం స్ఫూర్తిదాయకమన్నారు. సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు మాట్లాడుతూ డాక్టర్ షాహిద్ ఉన్న శిఖరాలను అధిరోహించి, జిల్లా ప్రజలకు సేవలందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎమర్జెన్సీ మెడిసిన్ ప్రధాన విభాగాధిపతి డాక్టర్ వేముల శ్రీనివాసులు, వైస్ ప్రిన్సిపల్లు డాక్టర్ షారోన్ సోనియా, డాక్టర్ షంషాద్‌బేగం, డాక్టర్ నవీన్, ప్రొఫెసర్లు భీమసేనాచార్, రామస్వామి, శివశంకర్‌నాయక్, సుచిత్రశౌరి, వైద్యులు డాక్టర్ షహజీర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆదిరెడ్డి పరదేశీ నాయుడు పాల్గొన్నారు.

భర్త చేతిలో భార్య హతం


హిందూపురం అర్బన్: అనుమానం పెనుభూతమై భర్త చేతిలో భార్య హతమైంది. పోలీసులు తెలిపిన మేరకు... హిందూపురంలోని టీచర్స్ కాలనీలో నివాసముంటున్న దంపతులు వనిత (45), విజయ్‌కుమార్ కొంత కాలంగా తరచూ గొడవపడేవారు. భార్య ప్రవర్తనపై అనుమానం పెంచుకుని తరచూ ఆమెను భర్త వేధింపులకు గురి చేస్తూ వచ్చాడు. ఈ క్రమంలో గురువారం దంపతులిద్దరూ తీవ్ర స్థాయిలో ఘర్షణ పడ్డారు. అనంతరం అనంతపురంలోని కళాశాల హాస్టల్ ఉంటూ బీటెక్ చదువుకుంటున్న కుమార్తె విఖితకు తల్లి ఫోన్ చేసి విషయం తెలిపింది. మధ్యాహ్న సమయంలో విఖితకు విజయ్‌కుమార్ ఫోన్ చేసి 'మీ అమ్మ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది' అని తెలిపి ఫోన్ కట్ చేశాడు. ఆమె ఇంటికి చేరుకునేలోపు పోలీసులు అక్కడకు చేరుకుని విచారణ చేపట్టారు. వనిత గొంతు నులిమి హతమార్చినట్లుగా ప్రాథమికంగా పోలీసులు నిర్ధారించారు. విజయ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని, విఖిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ రియాజ్ అహమ్మద్ తెలిపారు.

వాహనం ఢీ - యువకుడి మృతి


మృతుడు భాస్కర్

మడకశిర: వాహనం ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... మడకశిర పట్టణ సమీపంలోని చౌటిపల్లికి చెందిన భాస్కర్(22) బుధవారం రాత్రి 10 గంటల సమయంలో పనిపై ఇంటి నుంచి బయటకు వచ్చాడు. రాత్రి 11 గంటల సమయంలో కుటుంబసభ్యులు ఫోన్ చేసి మాట్లాడారు. ఇంటికి వస్తున్నట్లుగా తెలిపిన భాస్కర్ ఎంత సేపటికీ చేరుకోలేదు. దీంతో మరోసారి కుటుంబసభ్యులు ఫోన్ చేశారు. ఫోన్ స్విచ్ఛాఫ్ అని వచ్చింది. ఈ క్రమంలో గురువారం తెల్లవారుజామున చౌటిపల్లి సమీపంలోని జాతీయ రహదారిపై వెళ్లిన స్థానికులు అక్కడ రోడ్డుపై పడి ఉన్న భాస్కర్ మృతదేహాన్ని గుర్తించి సమాచారం ఇవ్వడంతో కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని బోరున విలపించారు. గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందినట్లుగా నిర్ధారించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

బావిలో పడి యువకుడి మృతి


మృతుడు సాయినాథరెడ్డి

తలుపుల: ప్రమాదవశాత్తు బావిలో పడి ఓ యువకుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... తలుపుల మండలం బురుజుపల్లికి చెందిన బ్రహ్మానంద రెడ్డి కుమారుడు సాయినాథరెడ్డి (23) బుధవారం మధ్యాహ్నం తన స్నేహితులతో కలసి ఉబ్బరవాండ్లపల్లి సమీపంలోని బావి వద్దకు ఈత కొట్టేందుకు వెళ్లాడు. బావిలోకి దూకగానే సాయినాథరెడ్డికి ఫిట్స్ వచ్చి నీట మునిగిపోయాడు. లోతుగా ఎక్కువగా ఉండడంతో కాపాడేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. సమాచారం అందుకున్న తల్లిదండ్రులు, గ్రామస్తులు అక్కడకు చేరుకుని గాలింపు చేపట్టారు. చీకటి పడడంతో సాధ్యం కాక వెనుదిరిగారు. గురువారం ఉదయం బావి వద్దకు చేరుకోగానే నీటిలో సాయినాథరెడ్డి మృతదేహం తేలియాడుతూ కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని వెలికి తీశారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

నీటి సంపులో పడి బాలుడి మృతి


మృతుడు జీషన్

గుంతకల్లు రూరల్: నీటి సంపులో పడి ఓ బాలుడు మృతి చెందాడు. వివరాలు... గుంతకల్లులోని కసాపురం రోడ్డు సమీపంలో ఉన్న బెస్త కాలనీలో నివాసముంటున్న మహబూబ్ దౌలా, రమీజా దంపతులకు ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఓ కుమార్తెతో పాటు నాలుగేళ్ల వయసున్న కుమారుడు జీషన్ ఉన్నారు. ఆటో డ్రైవర్‌గా మహబూబ్ దౌలా, గార్మెంట్ షాపులో కార్మికురాలిగా రమీజా పనిచేస్తే కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. గురువారం ఉదయం ఇంటి ఆవరణలో ఉన్న సంపుపై మూతను రమీజా తొలగించి నీటిని తోడుకున్న అనంతరం పనికి వెళ్లే తొందరలో సంపుపై మూత పెట్టడం మరిచిపోయింది. ఆ సమయంలో అక్కతో కలసి ఆడుకుంటున్న జీసన్ ప్రమాదవశాత్తు సంపులో పడ్డాడు. గమనించిన అక్క వెంటనే పరుగున వెళ్లి తండ్రికి తెలపడంతో ఆయన వచ్చి సంపులో దిగి నీట మునిగిన కుమారుడిని వెలికి తీశారు. అపస్మారక స్థితికి చేరుకున్న జీషన్‌ను వెంటనే తన ఆటోలో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లాడు. పరీక్షించిన వైద్యులు అప్పటికే బాలుడు మృతి చెందినట్లు నిర్ధారించారు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు.

బార్‌లు, మద్యం దుకాణాల్లో తనిఖీలు

అనంతపురం: నగరంలోని బార్‌లు, ప్రభుత్వ మద్యం షాపులను గురువారం ఉదయం ఎక్సైజ్ శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీ చేశారు. బార్‌లు, మద్యం షాపుల్లో పనిచేస్తున్న సేల్స్‌మెన్‌లతో ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎస్.బాలకృష్ణ మాట్లాడుతూ.... ఎన్నికల నిబంధల మేరకు మద్యం విక్రయాలు సాగించాలని ఆదేశించారు. ఎవరైనా అతిక్రమిస్తే చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా, ప్రభుత్వ మద్యం దుకాణాల్లో వ్యాపారా లావాదేవీలను పరిశీలించి రూ.1.28 లక్షలు సొంతానికి వాడుకున్న సిబ్బంది నుంచి రికవరీ చేశారు. వారిపై కేసులు నమోదు చేసి, తొమ్మిది మందిని విధుల నుంచి తొలగించారు. అలాగే సుంకం చెల్లించని మద్యాన్ని తరలిస్తున్న వారిపై 16 కేసులు నమోదు చేశారు. 20 మందిని అరెస్ట్ చేసి 45 లీటర్ల మద్యం, మూడు ద్విచక్రవాహనాలను సీజ్ చేశారు.

హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్


వ్యాక్సినేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబదేవి

అనంతపురం మెడికల్: హజ్ యాత్రకు వెళ్లే ముస్లింలకు గురువారం చేపట్టిన వ్యాక్సినేషన్ ప్రక్రియ విజయవంతమైంది. ప్రభుత్వ వైద్య కళాశాల ఆడిటోరియంలో చేపట్టిన వ్యాక్సినేషన్ ప్రక్రియను డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబదేవి, డీఐఓ డాక్టర్ యుగంధర్ పరిశీలించారు. మొత్తం 216 మంది మహిళలు, పురుషులకు వ్యాక్సిన్ వేశారు. ఏటా హజ్ యాత్రికులకు ప్రభుత్వం తరఫున ఉచితంగా వ్యాక్సిన్ వేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో గురువారం వ్యాక్సిన్ వేయించుకోని వారి కోసం మరో రోజు ఈ ప్రక్రియను చేపట్టనున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబదేవి తెలిపారు. కార్యక్రమంలో హజ్ కమిటీ ప్రతినిధి మౌలానా ముస్తఫా అహ్మద్, ఎంఏ మునీర్ బాషా, జాఫర్ మొహిద్దీన్, వ్యాక్సిన్ విభాగం బీఎస్వీ రాజు, శ్యామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరి దుర్మరణం

- ఆగి ఉన్న లారీని ఢీకొన్న ఐచర్
- మృతులు తమిళనాడు వాసులు



మృతులు విజయ్ శివలింగ, తమిళమారన్

పెనుకొండ రూరల్: లారీని వెనుక నుంచి ఐచర్ వాహనం ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతి చెందారు. కియా ఎస్‌ఐ రంగడు తెలిపిన మేరకు... హైదరాబాద్ నుంచి తమిళనాడులోని తిరువన్నూరు జిల్లా తాళం పల్లె తాలూకా, సిలుకై గ్రామానికి బయలుదేరిన ఐచర్ వాహనం గురువారం తెల్లవారుజామున శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ రూరల్ పరిధిలోని గుట్టూరు కనుమ వద్దకు చేరుకోగానే 44వ జాతీయ రహదారిపై ఎదురుగా మరమ్మతులకు లోనై ఆగి ఉన్న సిమెంట్ లారీని ఢీకొంది. ఘటనలో ఐచర్ వాహన డ్రైవర్ విజయ్ శివలింగ(29), ఆయన మేనల్లుడు తమిళమారన్ (11) తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని క్షతగాత్రులను వెంటనే పెనుకొండలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స అందేలోపు విజయ్ శివలింగ మృతి చెందాడు. ప్రథమ చికిత్స అనంతరం తమిళమారన్‌ను బెంగళూరుకు తీసుకెళుతుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

'వైఎస్సార్‌సీపీకే మా మద్దతు'

అనంతపురం: రాయలసీమ పురోభివృద్ధికి బాటలు వేస్తున్న వైఎస్సార్‌సీపీకే తమ మద్దతు అని రాయలసీమ యునైటెడ్ ఫోర్స్ (ఆర్‌యూఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు తిప్పిరెడ్డి నాగార్జునరెడ్డి తెలిపారు. శ్రీ బాగ్ ఒప్పందం మేరకు అభివృద్ధి వికేంద్రీకరణకు కట్టుబడి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అందరూ ఆదరించాలని పిలుపునిచ్చారు. రాయలసీమకు న్యాయ రాజధానితో పాటు నీటి ప్రాజెక్టుల నిర్మాణంలో అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నారని ప్రశంసించారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు అనంతపురంలోని ప్రెస్ క్లబ్‌లో జరిగే రాయలసీమ యునైటెడ్ ఫోర్స్ ప్రతినిధుల సమావేశం ఉంటుందని పేర్కొన్నారు.

పార్టీలన్నీ ఏకమైనా వైఎస్సార్‌సీపీదే గెలుపు



ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అనంత, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ



వైఎస్సార్‌సీపీలో చేరిన యువకులతో ఎమ్మెల్యే అనంత, బుల్లే శివబాల

- హామీలన్నీ అమలు చేశాం
- మంచి చేస్తున్న ప్రభుత్వానికి అండగా నిలవండి
- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, ఎంపీ అభ్యర్థి శంకరనారాయణ

అనంతపురం రూరల్: ఈ ఎన్నికల్లో పార్టీలన్నీ ఏకమైనా వైఎస్సార్‌సీపీదే గెలుపు. ఇచ్చిన హామీలన్నీ అమలు చేశాం. మంచి చేస్తున్న ప్రభుత్వానికి అండగా నిలవాలని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, ఎంపీ అభ్యర్థి శంకరనారాయణ ప్రజలను కోరారు. గురువారం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, వైఎస్సార్‌సీపీ డిప్యూటీ రీజనల్ కో–ఆర్డినేటర్ రాగే పరశురాం, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి రుద్రంపేటలో ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ ఈ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి , అనంతపురం ఎంపీ అభ్యర్థి శంకరనారాయణ మాట్లాడుతూ.. చంద్రబాబు పాలనంతా అవినీతి మోసాలే అన్నారు. ఈయన ఇచ్చే అబద్ధపు హామీలు నమ్మితే మోసపోవడం ఖాయమన్నారు. అభివృద్ధి సంక్షేమమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసినట్లు వెల్లడించారు. రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించినట్లు వెల్లడించారు. ప్రతి ఇంటికి నవరత్నాలు పథకాలు అందించి వారి జీవన ప్రమాణాలు మెరుగు పరచామన్నారు. అన్ని వర్గాల ప్రజలకు మంచి చేస్తున్న ప్రభుత్వానికి అండగా ఉంటేనే సంక్షేమం కొనసాగుతుందన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. కరోనా కష్టకాలంలో సైతం సంక్షేమ పథకాలు అందించి ప్రజలకు అండగా నిలిచామన్నారు. మాట ఇస్తే ఎంత కష్టమైనా మాటమీద నిలబడే వ్యక్తి సీఎం జగన్ అన్నారు. అన్ని వర్గాల ప్రజలకు మంచి చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కొనే సత్తా లేకనే దొంగల ముఠా అంతా కూటమిగా ఏర్పడిందన్నారు. 2014 ఎన్నికల్లో మాదిరే దొంగ హామీలు ఇచ్చి అధికారంలోకి రావాలని చంద్రబాబు ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజలు అప్రమత్తంగా లేకపోతే మళ్లీ మోసపోవాల్సి వస్తుందన్నారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ విడుదల చేసిన మేనిఫెస్టోను బీజేపీ నాయకులే నమ్మడం లేదన్నారు. ఇక ప్రజలు ఎలా నమ్ముతారని ఎద్దేవా చేశారు. ప్రజలకు మంచి చేశాం కనుకే మీ ఇంట్లో మంచి జరిగి ఉంటేనే ఓటు వేయమని ధైర్యంగా అడుగుతున్నామన్నారు. ప్రజలకు ఇది చేశానని చెప్పే ధైర్యం చంద్రబాబుకు ఉందా అని ప్రశ్నించారు. చంద్రబాబు బడాబాబులు, వ్యాపార వేత్తలకు టికెట్లు ఇచ్చారని తెలిపారు. కేవలం రాజకీయ ప్రయోజనాలే వారికి ముఖ్యమన్నారు. అలాంటి వారు ఎన్నికలు అయిపోగానే కనిపించరని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మావతి, ఎంపీటీసీలు మహబూబీ, లక్ష్మీనారాయణమ్మ, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, ఎంపీటీసీ నాగేంద్ర, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, జిల్లా వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ కాఫుజ్‌గర్ రిజ్వాన్, పార్టీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లాబేగ్, సీనియర్ నాయకులు అనంత చంద్రారెడ్డి, తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఆలమూరు శ్రీనివాసరెడ్డి, రూరల్ మండల కన్వీనర్ హుస్సేన్, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటేష్ నాయక్, కృష్ణవేణి, గోవింద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

అనంతపురం కార్పొరేషన్: కురుబ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, వైఎస్సార్‌సీపీ నాయకురాలు బుల్లె శివబాల ఆధ్వర్యంలో కొందరు యువకులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. గురువారం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి స్వగృహంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి యువకులకు వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో చోటు, ప్యారీ, మల్లిక, నసీమ, సెల్‌ఫోన్ బాషా, సాయికిరణ్, షెక్షావలి, సుబహాన్, సోము, ఖాజావలి, లోకేష్, మౌళాలి, శెఖ, అనీఫా, గిరి తదితరులు ఉన్నారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, ఎంపీ అభ్యర్థి శంకర నారాయణ గెలుపునకు కృషి చేస్తామన్నారు.



మాట్లాడుతున్న తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, చిత్రంలో ఎంపీ అభ్యర్థి శాంత



రోడ్ షోకు భారీగా తరలివచ్చిన ప్రజలు, కార్యకర్తలు

చంద్రబాబువి బూటకపు హామీలు

- అభివృద్ధి చేసిన వైఎస్సార్‌సీపీకి మరో అవకాశం ఇవ్వండి
- ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, బోయ శాంత
- ఆయా గ్రామాల్లో గజమాలలతో ఘన స్వాగతం

చెన్నేకొత్తపల్లి: చంద్రబాబువి బూటకపు హామీలు. ఆ హామీలు నమ్మి మోసపోవద్దు. అభివృద్ధి చేసిన వైఎస్సార్‌సీపీకి మరో అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, బోయ శాంత కోరారు. గురువారం మండలంలోని గువ్వలగొందిపల్లి, ముష్టికోవెల, సుబ్బరాయనిపల్లి, న్యామద్దెల, చిన్నంపేట, హరియాన్‌చెరువు తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ప్రచారానికి వెళ్లిన ప్రతి గ్రామంలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, బోయ శాంతకు ఆయా గ్రామాల ప్రజలు పూలవర్షం కురిపిస్తూ ఘనంగా స్వాగతం పలికారు. మహిళలు ఇంటింటా హారతులు ఇచ్చి ఆహ్వానించారు. ముష్టికోవెల, చెన్నేకొత్తపల్లి గ్రామాల్లో వారిని గజమాలతో సత్కరించారు. ఆయా గ్రామాల్లో జరిగిన సభల్లో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, బోయ శాంతమ్మ మాట్లాడారు. అభివృద్ధి చేసిన వారిని గుర్తించాలన్నారు. ఈనెల 13న జరిగే ఎన్నికల్లో ఓట్లు వేసి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని ఓటర్లకు సూచించారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టారన్నారు. అవి యథావిధిగా కొనసాగాలంటే వైఎస్ జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కులం, మతం, ప్రాంతం భేదాలు లేకుండా అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేశామన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో ఫ్యాక్షన్ లేకుండా చేసి ప్రజలు సంతోషంగా ఉండేలా చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. పరిటాల హయాంలో హత్యారాజకీయాలతో ప్రజలు చాలా అవస్థలు పడ్డారన్నారు. సీఎం జగన్ పాలనలో ప్రజలు సుఖశాంతులతో హాయిగా జీవిస్తున్నారన్నారు. పరిటాల శ్రీరామ్‌కు ధర్మవరం టికెట్ ఇవ్వకపోవడంతో చెన్నేకొత్తపల్లి మండలానికి వచ్చి ప్రజలను ఓటులే అడుగుతున్నారని ఎద్దేవా చేశారు. పరిటాల కుటుంబం ప్రజలకు సేవ చేయక పోగా దోచుకున్నారని మండిపడ్డారు. ఈ ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే మరిన్ని సంక్షేమ పథకాలను కొనసాగించడం జరుగుతుందన్నారు. చంద్రబాబు ఆచరణకు సాధ్యం కాని హామీలు ఇస్తున్నారని గుర్తు చేశారు. వాటిని నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. 25 ఏళ్లుగా పరిటాల కుటుంబం అధికారంలో ఉన్నా.. ఈ ప్రాంత అభివృద్ధికి ఏమాత్రం కృషి చేయలేదన్నారు. రామగిరిలో బంగారు గనులను తెరిపించేందుకు కృషి చేస్తున్నామన్నారు. అనంతరం ఎంపీ అభ్యర్థి బోయ శాంత మాట్లాడుతూ.. ఎమ్మెల్యేగా తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని, ఎంపీగా తనను గెలిపిస్తే ఈ ప్రాంత అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు. ఈ ప్రాంతంలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించేందుకు పరిశ్రమలను తీసుకొస్తామని హామీ ఇచ్చారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తమను దీవించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల్లోని నాయకులు, కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



న్యామద్దెల రోడ్‌షోలో మహిళల ఆనందహేల

క్లుప్తంగా


ఎమ్మెల్యే అనంతను ఆశీర్వదించాలి



హౌసింగ్ బోర్డులో ప్రచారం చేస్తున్న అనంత మాలతి, తదితరులు

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశీస్సులు, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ప్రత్యేక చొరవతో అనంతపురం నియోజకవర్గం అభివృద్ధికి కేరాఫ్‌గా నిలిచింది. ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డిని మరోసారి గెలిపించాలని ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు నగర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గురువారం ఎమ్మెల్యే అనంత కుటుంబీకులు అనంత మాలతి, అనంత సువర్ణ, అనంత మేఘన, అనంత లిఖిత్‌రెడ్డి తదితరులు 26వ డివిజన్ హౌసింగ్ బోర్డు, 32వ డివిజన్ ఆదర్శనగర్, 47వ డివిజన్, అనంతపురం రూరల్‌లో విస్తృత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో రూ.1,045 కోట్ల అభివృద్ధి జరిగిందన్నారు. ప్రధాన రోడ్లతో పాటు మారుమూల ప్రాంతాల్లో రోడ్లు, కాలువలను ఏర్పాటు చేసేలా ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ చూపిన విషయాన్ని గుర్తు చేశారు. సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే మరోసారి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు.

షటిల్ కోర్టు ప్రారంభం



షటిల్ కోర్టును ప్రారంభించిన ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు

అనంతపురం మెడికల్: ప్రభుత్వ వైద్య కళాశాలలోని బాలికల వసతి గృహం విద్యార్థులకు షటిల్, టేబుల్ టెన్నిస్ కోర్టులు ఏర్పాటు చేసేలా ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు చర్యలు తీసుకున్నారు. గురువారం షటిల్, టీటీ కోర్టును ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు, వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ షారోన్ సోనియా, డాక్టర్ షంషాద్‌బేగం, డాక్టర్ సుచిత్ర శౌరి, డాక్టర్ వేముల నీరజ ప్రారంభించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. నిత్యం చదువులతో బిజీగా ఉండే విద్యార్థులకు రోజూ మానసికోల్లాసం అవసరమన్నారు. అందులో భాగంగానే షటిల్, టీటీ కోర్టును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. చదువుతో పాటు క్రీడలు తప్పనిసరి అన్నారు. కార్యక్రమంలో వైద్య కళాశాల ఫిజికల్ డైరెక్టర్ నరసింహ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆదిరెడ్డి పరదేశీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా విక్రేత అరెస్టు

యాడికి: మండలంలోని గుడిపాడు గ్రామ శివారులో నాటుసారా విక్రయిస్తున్న దండు తిరుపాలు అరెస్టు చేసినట్లు సీఐ నాగార్జున రెడ్డి గురువారం తెలిపారు. అతడి నుంచి 8 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నామన్నారు.

‘చంద్రబాబు వస్తే పథకాలు రద్దు చేస్తారు’



ముట్టాలలో ప్రచారం చేస్తున్న తోపుదుర్తి శైలజారెడ్డి

ఆత్మకూరు: చంద్రబాబు అధికారంలోకి వస్తే ఇప్పుడున్న పథకాలన్నీ రద్దు చేస్తారు. ఎన్నికల్లో గెలిచేందుకు అబద్ధపు హామీలు ఇస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకురాలు తోపుదుర్తి శైలజారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ముట్టాల, పాపంపల్లి, గొరిదిండ్ల, గొరిదిండ్ల తండా గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చంద్రబాబు అధికారంలోకి వస్తే మళ్లీ జన్మభూమి కమిటీలు వస్తాయన్నారు. పథకాల కోసం జన్మభూమి కమిటీ సభ్యుల ఇళ్ల దగ్గర వేచి ఉండాల్సిన కర్మ ప్రజలకు పట్టలేదన్నారు. పార్టీలతో సంబంధం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందజేసిన ఘనత జగనన్నకే దక్కుతుందని వివరించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ హేమలత, కన్వీనర్ లక్ష్మీనరసింహులు, యూత్ కన్వీనర్ కొండారెడ్డి, వైస్ ఎంపీపీ విజయ్ సర్పంచులు తిరుపాలమ్మ, నాగరత్నమ్మ, ఎంపీటీసీ చిట్టెమ్మ, పార్వతమ్మ, సుశీల, మంజుల, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, బాలపోతన్న, ముత్యాలరెడ్డి, లక్ష్మీరెడ్డి, ఓబయ్య, ఫణిరెడ్డి, అక్కులన్న, మాధన్న, మల్లేష్, పోతన్న, నరసింహులు, రాము నాయక్, కాయగూరల ముత్యాలు, లక్ష్మీనారాయణ రెడ్డి, అతిక్‌రెడ్డి, మల్లన్న, శ్రీనాథ్ రెడ్డి, హనుమంతు నాయక్, మహేష్ నాయక్, హరి, దామోదర్ రెడ్డి, శ్రీరామ్, మురళి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సిండికేట్ నగర్‌లో జోరుగా ప్రచారం



ప్రచారం చేస్తున్న తోపుదుర్తి మనోరమరెడ్డి

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి పంచాయతీ పరిధిలోని సిండికేట్ నగర్, రామకృష్ణపురం, సిండికేట్ నగర్ హైకాలనీల్లో గురువారం ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సతీమణి తోపుదుర్తి మనోరమరెడ్డి ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా జగనన్న ముఖ్యమంత్రి అయిన తర్వాత పేద వర్గాలు అభివృద్ధి చెందాయని తెలిపారు. ఎవరి వద్దకు వెళ్లకుండానే ఇంటి వద్దకే పథకాలు వస్తున్నాయన్నారు. మళ్లీ అలాంటి పాలన కావాలంటే జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ధనుంజయ యాదవ్, బెడదూరి సుధ, పద్మావతి, సర్పంచ్ బండా అంజియాదవ్, ఎంపీటీసీ సభ్యుడు గౌస్, స్థానిక నాయకులు బాలకృష్ణ, రామాంజనేయులు, భానుకోట శివ, శ్రీరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఖర్చులకు ఆర్థికసాయం



బాధిత కుటుంబ సభ్యులతో అమ్మ సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి

అనంతపురం: ఓ కూలీ వైద్య ఖర్చులకు ఆర్థికసాయం అందజేసి మానవత్వం చాటుకున్నారు అమ్మ సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి. వివరాలు.. నగరంలోని హమాలీ కాలనీలో నివాసం ఉంటున్న ఆంజనేయులు తోపుడు బండి కూలీగా.. భార్య గొల్లక్క ఇంటి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గత 15 సంవత్సరాలుగా వచ్చిన కూలి డబ్బుతో జీవనం సాగించేవారు. ఇటీవల ఆంజనేయులుకు కడుపు నొప్పి రావడంతో నగరంలో ఉన్న డాక్టర్లను సంప్రదించారు. స్కానింగ్ చేయగా పాంక్రియాస్‌లో ఇన్ఫెక్షన్ గడ్డలు రావడంతో బెంగళూరులోని ఓ ఆస్పత్రికి రెఫర్ చేశారు. చికిత్సకు రూ.2.50 లక్షలు అవసరమని వైద్యులు తెలిపారు. ఆంజనేయులు దంపతులు తోపుడు బండి అమ్మి రూ.20 వేలు సమకూర్చుకున్నారు. అనంతరం సాయం కోరుతూ అమ్మ సంస్థ కార్యాలయంలో సంప్రదించారు. స్పందించిన అమ్మ సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణా రెడ్డి రూ.2 లక్షల ఆర్థికసాయం అందజేశారు. అలాగే బెంగళూరు వెళ్లడానికి దారి ఖర్చులకు మరో రూ.5 వేలు అందజేశారు.

కణేకల్లు ఆసుపత్రిని సందర్శించిన డీసీహెచ్ఎస్

కణేకల్లు: కణేకల్లు ప్రభుత్వాస్పత్రిని డీసీహెచ్ఎస్ పాల్ రవికుమార్ గురువారం సందర్శించారు. ఓపీ రూమ్, జనరల్ వార్డు, క్యాజువాలిటీ వార్డుల్లోకెళ్లి వైద్యసేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. డాక్టర్లు, సిబ్బంది సేవలు సరిగా అందిస్తున్నారా? ఏవైనా ఇబ్బందులున్నాయా? అంటూ ప్రశ్నించారు. 24 గంటల ఆసుపత్రి కావడంతో రోగులు ఇబ్బందులు పడకుండా డ్యూటీ డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. దంత వైద్యసేవల కోసం మరికొన్ని పరికరాలు అవసరమని వాటిని త్వరలో అందుబాటులో ఉంచి మెరుగైన సేవలందించేలా చర్యలు తీసుకొంటామని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు నిరీషా, మహీంద్రా, షరీఫ్, పావని, హర్షవర్ధన్, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

కదిరి అర్బన్: పట్టణంలోని అడపాలవీధిలో ఉన్న గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో ప్రవేశానికి ఈనెల 20లోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ మురళీ శ్రీనివాస్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇంగ్లిష్ మీడియం 3వ తరగతిలో 40 సీట్లు ఉన్నాయని, ఇందులో ఎస్టీ 32,ఎస్సీ 5, బీసీ 02, ఓసీ 01, 4వ తరగతిలో 28 సీట్లు, 5వ తరగతిలో 7 సీట్లు, 9వ తరగతిలో 2 సీట్లు కేవలం ఎస్టీ విద్యార్థులకు మాత్రమే ఉన్నాయని తెలిపారు. వివరాలకు 9441059189 నంబరులో సంప్రదించాలని కోరారు.

‘నన్ను బెదిరించలేదు’

కనగానపల్లి: భూ సమస్య వల్ల పార్టీ మారాలని భావించాం. తనపై ఎవ్వరూ బెదిరింపులకు పాల్పడలేదని వేపకుంట తలారి పుల్లప్ప తెలిపారు. మండలంలోని వేపకుంట గ్రామంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తనపై ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి సోదరులు బెదిరింపులకు పాల్పడినారని కొందరు అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. కాని అందులో ఎటువంటి నిజం లేదన్నారు. వాస్తవానికి ఎమ్మెల్యే, ఆయన సోదరులు మా కుటుంబానికి ఎంతో సహాయం చేశారని తెలిపారు. ఎప్పటి నుంచో మేము వైఎస్సార్‌సీపీలో ఉంటున్నామన్నారు. కాని చిన్న భూ సమస్య విషయంలో స్థానిక నాయకులతో విబేధాలు వచ్చి టీడీపీ వారితో కలసిన మాట వాస్తవమేనన్నారు. ఈ సందర్భంలో తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి తమను పిలిపించుకుని మా సమస్యలు అడిగి తెలుసుకున్నారని పేర్కొన్నారు. సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారని వెల్లడించారు.

నేడు ఎన్నికల ప్రచారం

కనగానపల్లి: రాప్తాడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి శుక్రవారం మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి తెలిపారు. ఉదయం 8 గంటలకు ముత్తవకుంట్లలో ప్రచారాన్ని ప్రారంభిస్తారన్నారు. కోనాపురం, పాతపాళ్యం, తరగకుంట, తూంచర్ల గ్రామ పంచాయతీల పరిధిలో సాయంత్రం వరకూ ప్రచారం కొనసాగుతుందని పేర్కొన్నారు.

రుద్రంపేటలో...

అనంతపురం కార్పొరేషన్: రుద్రంపేట పంచాయితీలో శుక్రవారం ఉదయం 6:30 గంటలకు ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రుద్రంపేట పంచాయతీలోని విమలాఫరూక్ నగర్ నుంచి ప్రచారం మొదలవుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, నాయకులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

సమయపాలన తప్పనిసరి

అనంతపురం క్రైం: సమయపాలన తప్పనిసరిగా పాటించాలని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సుమంత్ ఆర్ ఆదోని సిబ్బందికి సూచించారు. గురువారం స్థానిక ఆర్ఎం కార్యాలయంలో జిల్లాలోని డిపో మేనేజర్లు, డిపో ట్రాఫిక్ ఇన్‌చార్జ్‌లతో సమావేశం నిర్వహించారు. ప్రతి బస్సు కండీషన్ గుర్తించాలన్నారు. లోపాలుంటే చక్కదిద్దాలన్నారు. ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా ఆర్టీసీ సర్వీసుల టైమింగ్ మార్చాలన్నారు. బ్రేక్‌డౌన్ తగ్గించి, కేఎంపీఎల్ పెంచాలని సూచించారు. ప్రమాదాలు నియంత్రించేందుకు డ్రైవర్లకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సీటీఎం రమేష్, డిపోల మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆదరణ ఓర్వలేక దాడులు చేస్తున్నారు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే అనంత, డాక్టర్ మునిరత్నం, తదితరులు

- టీడీపీ అభ్యర్థి దగ్గుపాటితో నగరంలో అలజడి
- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి
- డాక్టర్ మునిరత్నం ఆధ్వర్యంలో పలువురు వైఎస్సార్‌సీపీలో చేరిక

అనంతపురం కార్పొరేషన్: గత టీడీపీ ప్రభుత్వంలో అనంతపురం నియోజకవర్గంలో భయాందోళన పరిస్థితులు ఉండేవి. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలోని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో నగరంలో ప్రశాంత వాతావరణం కల్పించేందుకు చర్యలు తీసుకున్నామని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. గురువారం రాత్రి వేణుగోపాల్ నగర్‌లో వైఎస్సార్‌సీపీ నేత డాక్టర్ మునిరత్నం ఆధ్వర్యంలో కొందరు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి వారికి వైఎస్సార్ సీపీ కండువాలను వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రమంతటా వైఎస్సార్‌సీపీ గాలి వీస్తోందన్నారు. అనంతపురం నియోజకవర్గంలో రూ.2,304 కోట్ల సంక్షేమం, రూ.1,045 కోట్ల అభివృద్ధి చేయడంతో ప్రజలు వైఎస్సార్‌సీపీ పట్ల విశ్వాసంగా ఉన్నారన్నారు. ప్రచారంలో ప్రజలే ముందస్తుగా వైఎస్సార్‌సీపీకి అండగా ఉంటామని చెబుతున్నారన్నారు. టీడీపీ, జనసేన పార్టీలను వీడి వైఎస్సార్‌సీపీ వైపు మొగ్గు చూపుతున్నారన్నారు. ఇటువంటి తరుణంలో అనంతపురం రూరల్ పంచాయతీలో వైఎస్సార్‌సీపీకి వచ్చిన ఆదరణను చూసి టీడీపీ అభ్యర్థి దగ్గుపాటి వర్గీయులు రెచ్చిపోయారన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్త నగేష్‌పై హత్యాయత్నానికి పాల్పడ్డారన్నారు. సామాజిక మాధ్యమాల్లో నగేష్‌ను దారుణంగా హింసించిన ఘటనలను చూశామన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధి అనే విషయాలపైనే తాము దృష్టిసారిస్తామన్నారు. మేధావులు, యువత, ప్రజలు ముందుచూపుతో ఆలోచించి వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టాలన్నారు.

టీడీపీ హయాంలో కాపులకు అన్యాయం: డాక్టర్ మునిరత్నం

టీడీపీ నుంచి గత నెల 30న వైఎస్సార్ సీపీలోకి చేరిన డాక్టర్ మునిరత్నం మాట్లాడుతూ.. టీడీపీ ప్రభుత్వంలో కాపులకు తీరని అన్యాయం జరిగిందన్నారు. టీడీపీ డబ్బుకు మాత్రమే ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. ఏళ్ల తరబడి పార్టీని అంటిపెట్టుకుని ఉన్న కాపులను నట్టేట ముంచిందన్నారు. కాపులకు జరిగిన అన్యాయాన్ని చూడలేక టీడీపీకి గుడ్‌బై చెప్పి, సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సమక్షంలో పార్టీలోకి చేరడం జరిగిందన్నారు. 2024లో ఎన్నికల్లో అభ్యర్థుల కేటాయింపులో కాపులకు వైఎస్సార్‌సీపీ పెద్దపీట వేసిందన్నారు. కాపు సామాజిక వర్గం అధికంగా ఉన్న అనంతపురంలో కాపులకు టికెట్ కేటాయించకుండా టీడీపీ మోసం చేసిందన్నారు. నగరానికి సంబంధం లేని వ్యక్తి దగ్గుపాటికి టికెట్ కేటాయించిందన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపునకు కృషి చేస్తామన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నేత గుజరీ వెంకటేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రచార రథాన్ని ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. లక్ష్మి, ఓబుళమ్మ, ధనలక్ష్మి, మహాలక్ష్మి, లోకేష్, భరత్, తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో అనంతపురం, హిందూపురం నియోజకవర్గాల డిప్యూటీ రీజినల్ కో–ఆర్డినేటర్ రాగే పరుశురాం, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, జేసీఎస్ జిల్లా కో–ఆర్డినేటర్ వెన్నం శివరామిరెడ్డి, నాయకులు కృష్ణమూర్తి, రాయల్ యోగి, కేశవరెడ్డి, బాబా, సురేష్‌రెడ్డి, వెంకటేష్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ ప్రతిభావంతులకు మెడల్స్ అందజేత

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ఏపీఎన్జీవో భవనంలో ఎఫ్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు అభినందన సభ ఏర్పాటు చేశారు. మెడల్స్, ప్రశంసాపత్రాలు అందించారు. ముఖ్య అతిథులుగా ఎంఈఓ–2 వెంకటరమేష్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వీరేష్, అనంతపురం జిల్లా ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు బంగి శివ, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లికార్జున, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగార్జున, జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

బత్తలపల్లి: అనంతపురం–కదిరి జాతీయ రహదారిపై రామాంజులపల్లి బస్టాప్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. కడప నుంచి అనంతపురంలోని జేఎన్‌టీయూలో సర్టిఫికెట్‌ల కోసం స్వరాజ్, శరత్‌రెడ్డి కారులో బయలుదేరారు. రామాంజులపల్లి వద్దకు రాగానే కదిరి వైపు వెళ్తున్న ఐచర్, కారును ఢీకొంది. ప్రమాదంలో కారు డివైడర్‌ను ఎక్కి పక్కరోడ్డు వైపునకు దూసుకుపోయి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వారు ఇద్దరితో పాటు కారు డ్రైవర్ శ్రీనాథ్‌రెడ్డి గాయపడ్డాడు. వీరిని స్థానికులు వెంటనే ఆర్డీటి ఆసుపత్రికి తరలించారు. తర్వాత అనంతపురం తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా సంజీవపురం వద్ద ఆర్టీసీ బస్సును వెనుకవైపు బైక్ ఢీకొన్న ఘటనలో బత్తలపల్లికి చెందిన దాదాపీర్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108లో బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు.

జగన్‌తోనే ప్రజా సంక్షేమ పాలన


ఎమ్మెల్యే వైవీఆర్‌ను సన్మానిస్తున్న ఫ్రూట్ మండీ యజమానులు, వ్యాపారులు


ఎమ్మెల్యే వైవీఆర్, పార్టీ నాయకురాలు శివబాల సమక్షంలో పార్టీలోకి చేరిన 7వ వార్డు టీడీపీ, సీపీఐ నాయకులు, కార్యకర్తలు


పార్టీలోకి చేరిన తిమ్మాపురం గ్రామస్తులతో ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి

• ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

గుంతకల్లుటౌన్: రాష్ట్రంలో పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ప్రజా సంక్షేమ పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని మరోసారి ఆదరించాలని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి కోరారు. గురువారం పట్టణంలోని 11వ వార్డులో ఉన్న ఏజేఫ్ ఫ్రూట్ మండీ యజమాని జాఫర్‌సాబ్, జిలాన్, రఫీక్, మహబూబ్ సోదరులతో పాటు పండ్ల వ్యాపారులను ఎమ్మెల్యే కలసి మద్దతు కోరారు. అనంతరం మండీలో వ్యాపారులలతో సమావేశం నిర్వహించారు. ఐదేళ్లల్లో గుంతకల్లు నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిపై ఎమ్మెల్యే వివరించారు. గుంతకల్లులో అరాచకశక్తులకు చోటు లేదని, వ్యాపారులకు రక్షణ కవచంగా నిలుస్తానన్నారు. పొరపాటున టీడీపీ అధికారంలోకొస్తే వైఎస్సార్ కల్పించిన ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్ రద్దయ్యే ప్రమాదముందన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా శంకరనారాయణను గెలిపించాలన్నారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి, వార్డు ఇన్‌చార్జ్ మార్కెట్ వెంకటేష్, దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ హొన్నూర్‌వలి, మైనార్టీ నాయకులు నూర్‌నిజామి, మన్సూర్, సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి 100 మంది చేరిక

గుంతకల్లులోని 7వ వార్డు నాయకుడు కురుబ శంకర్ ఆధ్వర్యంలో టీడీపీ, సీపీఐలకు చెందిన 100 మంది నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. గురువారం స్థానిక అంకాలమ్మ గుడి వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి, నాయకురాలు శివబాల పాల్గొని కురుబ కిరణ్, కురుబ నాగలింగ, కుమార్, శేఖర్, శిల్పిసీనా, జగదీష్, సుధాకర్, రాఘవ, లింగన్న, లింగమ్మ, రత్నమ్మ, లింగమయ్య, లలితమ్మ, కీర్తి తదితరులను పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కె.శంకర్, తిమ్మారెడ్డి, గంగమ్మ, రామచంద్ర, ప్రశాంత్, వినోద్ పాల్గొన్నారు.

టీడీపీ,జనసేన నుంచి 40 కుటుంబాలు చేరిక

గుంతకల్లు రూరల్: మండలంలోని తిమ్మాపురం నుంచి గురువారం టీడీపీ, జనసేనకు చెందిన 40 కుటుంబాల వారు ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. తిమ్మాపురం సర్పంచ్ నీలమ్మ కుమారుడు నక్కా ఓబులేసు, వైస్ సర్పంచ్ ప్రసాద్, సోమనాథ్‌రెడ్డి, షబ్బీర్ ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన నుంచి జానీ, నాగేంద్రయ్య స్వామి, తిక్కన్న,నడిపి సుంకన్న, హరిజన ప్రసాద్, కుమ్మరి రాముడు, ఈడిగ నాగేంద్ర గౌడ్, నేసే మల్లి, నేసే అశ్వర్థం, నేసే చౌడయ్య, ఖలందర్, హరిజన ఓబుళపతి, బోయ నాగరాజు, హరిజన రవిస్వామి, అమీర్ బాషా, రియాజ్, మస్తాన్, ఈడిగ నాగప్ప చిన్న వీరాంజనేయులు, బసవరాజు, టార్జన్, హరిజన ప్రసాద్, ఖాశీంవలి, సుభాన్, మౌలాలి, నీలం రాజు బాయ్, మనోహర్, నారాయణస్వామి, చిన్న రంగ స్వామి , మోదిన తదితరులు వైఎస్సార్‌సీపీలోకి చేరారు. మున్సిపల్ మాజీ చైర్మన్ ఎన్.రామలింగప్ప తదితరులు పాల్గొన్నారు.

మరోసారి ఆశీర్వదించండి

గుంతకల్లు రూరల్: నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నిలిపిన తనను ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి కోరారు. గురువారం ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మండలంలోని గొల్లలదొడ్డి, వైటీ చెరువు గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా జగనన్న ప్రభుత్వం పనిచేసిన విషయాన్ని ప్రజలు గుర్తించుకోవాలన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎంపీగా శంకరనారాయణను, ఎమ్మెల్యేగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు సుధాకర్‌రెడ్డి, గాదిలింగేశ్వర బాబు, ఎమ్మెల్యే చిన్న అల్లుడు శ్రీకాంత్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ మోహన్ రావు, పోలింగ్ బూత్ కన్వీనర్ రాము, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

గుంతకల్లు రూరల్: మండలంలోని వైటీ చెరువు గ్రామంలో బీసీసెల్ మండల కన్వీనర్ జయ్యన్న ఆధ్వర్యంలో 30 కుటుంబాల సభ్యులు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోగురువారం చేరారు. ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి పార్టీ కండువాలను గప్పి ఆహ్వానించారు. సాయంత్రం ఎమ్మెల్యే వైవీఆర్ ప్రచారాన్ని నిర్వహించారు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు హనుమంతు, అనిల్ గౌడ్,నారాయణస్వామి, అశ్వత్ నారాయణ స్వామి నాయుడు, బాబు, రంగస్వామి, చిరంజీవి, ఖలీల్ బాషా, మహమ్మద్ రఫి, షబ్బీర్, అంజినప్ప, చిన్న అంజనేయులు, నాగరాజు తదితరులు పార్టీలో చేరారు. ఎమ్మెల్యే వైవీఆర్ చిన్న అల్లుడు శ్రీకాంత్ రెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాదిలింగేశ్వర బాబు, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ నక్కా భీమలింగప్ప, సుధాకర్ రెడ్డి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం


కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాదిలింగేశ్వరబాబు

గుంతకల్లు రూరల్: ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని పార్టీ సీనియర్ నాయకుడు సుధాకర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గాదిలింగేశ్వర బాబు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ నక్కా భీమలింగప్ప సూచించారు. ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి చిన్న అల్లుడు శ్రీకాంత్‌రెడ్డితో కలిసి గురువారం మండలంలోని తిమ్మాపురం, నక్కనదొడ్డి, నరసాపురం, నక్కన దొడ్డి తండా, ఎన్.కొట్టాల గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో వారు సమావేశం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ హయాంలో జరిగిన అభివృద్ధి, ప్రజలకు అందిన సంక్షేమ పథకాలను వివరిస్తూ మరోసారి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ మోహన్‌రావు, బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకన్న, పోలింగ్ బూత్ కన్వీనర్ రాము తదితరులు పాల్గొన్నారు.

వైవీఆర్‌ను మరోసారి ఆశీర్వదించండి


ఓటు అభ్యర్థిస్తున్న నైరుతిరెడ్డి, నిషితారెడ్డి

గుంతకల్లుటౌన్: గుంతకల్లు నియోజకవర్గంలో శాశ్వతంగా నిలిచిపోయేలా అభివృద్ధి కార్యక్రమాలు చేసిన ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డికి మీ చల్లని దీవెనలందించాలని ఎమ్మెల్యే కుమార్తెలు నైరుతిరెడ్డి, నిషితారెడ్డి కోరారు. గురువారం పట్టణంలోని 5వ వార్డులో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎంపీగా శంకరనారాయణ, ఎమ్మెల్యేగా వైవీఆర్‌ను గెలిపించాలని వారు కోరారు. కార్యక్రమంలో 5వ వార్డు మాజీ కౌన్సిలర్ పాండు, నాయకులు ఉడదాల హనుమేష్, వసంతకుమార్, మన్సూర్, కొట్టంసీనా, మస్తాన్, ప్రభాకర్, బాల, అశ్వర్థరెడ్డి, మనోహర్, నాయుడు, నరహరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీకే ఎమ్మార్పీఎస్ మద్దతు


వైఎస్సార్సీపీకి మద్దతును తెలియజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

గుంతకల్లు రూరల్: గుంతకల్లు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నిలిపిన వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డికి మద్దతు ఇస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రకటించారు. గురువారం పట్టణంలోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కేవిఎల్ స్వామిదాస్, రాయలసీమ ప్రధాన కార్యదర్శి సుంకన్న, మండల అధ్యక్షుడు దబ్బుల సుంకన్న తదితరులు మాట్లాడుతూ గుంతకల్లు నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసిన ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డితోపాటు, ఎంపీ అభ్యర్థి మాలగుండ్ల శంకరనారాయణకు మద్దతును ప్రకటిస్తూ వారి విజయానికి ఎమ్మార్పీఎస్ శ్రేణులు కృషి చేస్తాయన్నారు.

జగన్‌తోనే ముస్లిం మైనార్టీలకు రక్షణ


ఓటు అభ్యర్థిస్తున్న మైనార్టీ నేత ఫయాజ్ బాషా

గుంతకల్లుటౌన్: సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డితోనే ముస్లిం మైనార్టీల అభ్యున్నతి సాధ్యమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ నేత ఫయాజ్‌బాషా అన్నారు. గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ భవానీ, వైస్ చైర్‌పర్సన్ మైమూన్‌తో కలిసి ఆయన పట్టణంలోని 34, 35 వార్డుల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. జగనన్నతోనే ముస్లిం మైనార్టీలకు రక్షణ లభిస్తుందన్నారు. టీడీపీకి ఓటేస్తే దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి కల్పించిన నాలుగు శాతం రిజర్వేషన్ రద్దయ్యే ప్రమాదముందన్నారు. ఎమ్మెల్యేగా వై.వెంకటరామిరెడ్డి, ఎంపీగా శంకర్‌నారాయణను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన అభ్యర్థించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సుమో బాషా, కోఆప్షన్ సభ్యుడు ఫ్లయింగ్‌మాబూ, దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ హొన్నూర్‌వలి, మైనార్టీ నాయకులు గఫార్‌ఖాన్, యూసుఫ్‌ఖాన్, ఎం.ఎం.రహిమాన్, జమీల్, దౌలా, ఆసీఫ్, మౌలా, తస్వీర్, ఖలీల్, నూర్‌నిజామి, పీరా, ఆరీఫ్, కరీమ్, పామిడి సచివాలయాల కన్వీనర్ ఆసీఫ్, రుక్కాన్, షేక్షావలి, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు వారు పోర్టర్స్‌లైన్ దర్గాలో ప్రార్థనలు నిర్వహించారు.

ఓటు హక్కుపై అవగాహన

గుత్తి: పట్టణంలోని విరూపాక్షి రెడ్డి ఫంక్షన్ హాల్లో గురువారం ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నోడల్ ఆఫీసర్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కౌకుంట్లలో విశ్వన్నకు బ్రహ్మరథం


రాచేపల్లిలో ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వేశ్వరరెడ్డి, జెడ్పీ చైర్ పర్సన్ గిరిజమ్మ


వై.రాంపురం రోడ్‌షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వేశ్వరరెడ్డి, ఎంపీ మాధవ్, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

ఉరవకొండ: ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ సొంత పంచాయతీ అయిన కౌకుంట్ల పంచాయతీలో ఆయా గ్రామాల ప్రజలు విశ్వన్నకు బ్రహ్మరథం పట్టారు. గురువారం ఎన్నికల ప్రచారంలో భాగంగా కౌకుంట్ల పంచాయతీ పరిధిలోని మైలారంపల్లి, రాచేపల్లి, వై.రాంపురం, కౌకుంట్ల గ్రామాల్లో ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వేశ్వరరెడ్డి, హిందూపురం పార్లమెంట్ సభ్యుడు గోరంట్ల మాధవ్, జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ విస్తృతంగా ప్రచారం చేశారు. మైలారంపల్లి, రాంపురం గ్రామ రోడ్‌షోను ఉద్దేశించి ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వ మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో ఎమ్మెల్యే కేశవ్ ఆయన సోదరుడు సాగిస్తున్న అరాచాకాలకు చమరగీతం పాడాలన్నారు. కౌకుంట్ల పంచాయతీను అభివృద్ధి చెందనీయకుండా పయ్యావుల తన గుప్పెట్లో పెట్టుకొని ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ధ్వజమెత్తారు. వై.రాంపురంలోని ఎర్రిస్వామితాత ఆలయంలో ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వతో పాటు ఎంపీ, జడ్పీ చైర్‌పర్సన్‌లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కౌకుంట్ల గ్రామంలో ఎమ్మెల్యే అభ్యర్థికి భారీ స్వాగతం లభించింది. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఇమాం, అల్లాబక్ష్, ఖాసీం, స్వరూప్, వెంకటేష్, సుబ్బయ్య, కౌకుంట్ల వసంతమ్మ, మల్లికేసు, చెలమారెడ్డి, ఎర్రిస్వామి, ఎంపీపీ నరసింహులు, వైస్ ఎంపీపీ వై.శ్రీనాథ్‌రెడ్డి, కురుబ, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్లు రామాంజనేయులు, గోవిందు, పార్టీ రాష్ట్ర నాయకులు అశోక్, తేజోనాథ్, మాజీ జడ్పీటీసీ తిప్పయ్య, పార్టీ రూరల్ కన్వీనర్ సుంకన్న, రాకెట్ల నాయకులు నాగరాజు, శ్రీనివాసులు, శీనానాయక్ పాల్గొన్నారు.

నేడుకొనకొండ్లలో ప్రచారం

వజ్రకరూరు: మండలంలోని కొనకొండ్ల గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం 3గంటల నుంచి ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వేశ్వరరెడ్డి, ఎంపీ అభ్యర్థి శంకరనారాయణ ఆధ్వర్యంలో ప్రచారం ఉంటుందని మండల కన్వీనర్ సోమశేఖర్ తెలిపారు.

చేనేతలంతా జగనన్నకు అండగా నిలవాలి


కరపత్రాలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వ

ఉరవకొండ: ఎన్నికల్లో చేనేతలంతా జగనన్నకు అండగా నిలవాలని ఎమ్మెల్యే అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. గురువారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేనేతలకు చేసిన మేలును వివరిస్తూ ముద్రించిన కరపత్రాలను నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జ్ బెస్త రమణ, పార్టీ చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శి నేసే కోదండరాం, రాష్ట్ర , జిల్లా నేతలు కొత్తపల్లి హరినాథ్, ఎంసీ నాగభూషణం, చెంగల మహేష్, మిడతల చంద్రమౌళి, కరూర్ వెంకటేష్, నిమ్మల వెంకటరమణ, బీరేశివ, ఎర్రిస్వామిలతో కలిసి విశ్వేశ్వరరెడ్డి విడుదల చేశారు. అనంతరం విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ 2019లో చంద్రబాబు గత ఎన్నికల మేనిఫెస్టోలో చేనేతలకు 25 హామీలు ఇచ్చి ఒక్కటీ నేరవేర్చలేదన్నారు. చంద్రబాబు హయాంలో చేనతలకు రూ.442 కోట్లు ఖర్చు చేస్తే, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కరోనా కష్టాలను అధిగమించి రూ.3,706 కోట్లు ఖర్చు పెట్టారన్నారు. నేతన్న నేస్తం ద్వారా ఏడాదికి రూ.24 వేల ప్రకారం రూ.1.20 లక్ష అందించారన్నారు. బాబు ఆప్కోకు రూ.103 కోట్లు బకాయిలు చెల్లించలేదన్నారు. చేనేత రుణమాఫీ చేస్తామని ఒక్క పైసా చేయలేదన్నారు. వైఎస్ జగన్ అధికారంలోకి రాగానే పాత బకాయిలు మొత్తం రూ.468.84 కోట్లు చెల్లించారన్నారు. చేనేత వర్గాలకు చెందిన వారికి రెండు ఎంపీ, ఒక ఎమ్మెల్యే, నాలుగు కార్పొరేషన్ల చైర్మన్లుగా అవకాశం కల్పించారన్నారు. ఉరవకొండలో కుడా చేనేతకు పెద్ద పీట వేసి రూ.1.58 కోట్లతో చేనేత బ్లాక్ లెవెల్ క్లస్టర్ మంజూరు చేయించి, 320 మంది కార్మికులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

ముస్లింలు వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలి


మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ ముస్లిం మైనార్టీ నాయకులు

గుత్తి: ముస్లింలందరూ వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలని ఆ పార్టీ ముస్లిం మైనార్టీ నాయకులు పిలుపునిచ్చారు. గుత్తిలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం ప్రెస్‌మీట్ నిర్వహించారు. వైఎస్సార్ సీపీ ముస్లిం మైనార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు మైనుద్దిన్, పీరా, షఫి, సుంకం రఫీ, నజీర్, వెల్డింగ్ రవూఫ్ మాట్లాడారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్ కల్పించారన్నారు. మసీదులు, దర్గాల అభివృద్ధి, మరమ్మతులకు రూ.కోట్లు ఇచ్చారన్నారు. చంద్రబాబు గెలిస్తే ముస్లింలకు ప్రస్తుతం ఉన్న 4 శాతం రిజర్వేషన్ రద్దయ్యే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు ఫయాజ్, సుంకం రఫీ, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ షఫి, సికిందర్, అజీజ్ ఖాన్, బీఎంఎస్, దస్తగిరి, అబ్దుల్, బేల్దారి అన్వర్, డిష్ అన్వర్, గోరా, మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

మోపిడిలో ఎన్నికల నిబంధనలకు నీళ్లు

ఉరవకొండ: మండలంలోని మోపిడి గ్రామంలో టీడీపీ నాయకులు ఎన్నికల నియమావళిని తుంగలోతొక్కారు. టీడీపీ హయాంలో ఏర్పాటు చేసిన సిస్టమ్ ట్యాంకులకు టీడీపీ పసుపు రంగు కొట్టారు. దీన్ని అడ్డుకోవడానికి ప్రయత్నించిన వైఎస్సార్‌సీపీ నేతలపై బుధవారం రాత్రి దౌర్జన్యానికి దిగారు. దీనిపై నాయకులు ఆర్ఓకు ఫిర్యాదు చేశారు.

సీఎం జగనన్నతోనే స్వర్ణయుగం


ఎమ్మెల్సీ వై శివరామిరెడ్డి సమక్షంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరిన గజరాంపల్లి వాసులు


గజరాంపల్లిలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్సీ వై శివరామిరెడ్డి

పామిడి: సీఎం జగనన్నతోనే స్వర్ణయుగం సాధ్యమని ఎమ్మెల్సీ వై శివరామిరెడ్డి అన్నారు. మండలంలోని గజరాంపల్లి, ఎదురూరు. అక్కజాంపల్లి, వంకరాజుకాలువ, నెమళ్లపల్లి గ్రామాల్లో గురువారం ఆయన ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా అన్నివర్గాల ప్రజలకూ సంక్షేమ ప్రథకాలను అందించిన సీఎం జగన్ పాలన రామరాజ్యాన్ని తలపించిందన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు. ప్యాకేజీ దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్ కల్లిబొల్లి మాటలను నమ్మొద్దన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గుంతకల్లు ఎమ్మెల్యేగా వై.వెంకట్రామిరెడ్డిని, ఎంపీగా శంకరనారాయణను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ, రూరల్ కన్వీనర్లు జోజోడే కుమార్, కే నారాయణరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్కలూరు దిలీప్‌రెడ్డి, ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి, కిసాన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎల్ మధుసూదన్‌రెడ్డి, జిల్లా సంయుక్త కార్యదర్శి బీ రమణారెడ్డి, గుత్తి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ పెమ్మక చెన్నకేశవరెడ్డి, చుక్కలూరు రామకృష్ణారెడ్డి, సర్పంచ్‌లు రంగమ్మ, మహేశ్వరి, తలారి లక్ష్మీదేవమ్మ, నరసింహ, మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక

పామిడి: మండలంలోని గజరాంపల్లిలో టీడీపీ నేతలు ఆదినారాయణరెడ్డి, రామాంజనేయులురెడ్డి, హనుమంతరెడ్డి, సంజీవరెడ్డి, వెంకటరామిరెడ్డి, సుంకిరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, రామారావు తదితర 20 కుటుంబాలు ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి సమక్షంలో గురువారం వైఎస్సార్‌సీపీలోకి చేరారు. సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్ ఎన్నికల మ్యానిఫెస్టోకు ఆకర్షితులమై పార్టీలోకి చేరినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో గుత్తి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ పెమ్మక చెన్నకేశవరెడ్డి, అనిమిరెడ్డి, జంగం దేవేంద్ర, తిప్పారెడ్డి పాల్గొన్నారు.

చదరంగంలో విద్యార్థి ప్రతిభ



తండ్రి వినోదా కార్వాతో యువరాజ్ క్వారా

గుంతకల్లు: ఇటివల బెంగుళూరు, గోవా నగరాల్లో జరిగిన చదరంగం పోటీల్లో గుంతకల్లుకు చెందిన యువరాజ్ కార్వా ప్రతిభ కనబరిచారు. నారాయణ కళాశాలలో జూనియర్ ఇంటర్ చదువుతున్న యువరాజ్ కార్వా తండ్రి వినోద్ క్వారా వద్ద శిక్షణ పొంది ఆల్ ఇండియా రాపిడ్ ఓపెన్ చెస్ టోర్నీమెంట్స్‌లో 1418 రాపిడ్ రేటింగ్ సాధించారు.

మేలు చేసి ఉంటేనే వైఎస్సార్‌సీపీకి ఓటేయండి

• వైఎస్సార్‌సీపీ యువనేత వై.ప్రణయ్‌రెడ్డి


ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరుతున్న ప్రణయ్‌రెడ్డి

విడపనకల్లు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జగనన్న పాలనలో మేలు జరిగి ఉంటేనే ఓటు వేయండని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నేత ప్రణయ్‌రెడ్డి అన్నారు.గురువారం మండలంలోని జనార్దనపల్లి, మాళాపురం, విడపనకల్లు గ్రామాల్లో ప్రణయ్‌రెడ్డి ఆధ్వర్యంలో విజయ సంకల్ప యాత్ర నిర్వహించారు. ప్రణయ్‌రెడ్డికి కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున ఘన స్వా గతం పలికారు. అనంతరం రోడ్‌షోలో ప్రణయ్‌రెడ్డి మాట్లాడుతూ 58 నెలల్లో జగనన్న పాలనలో ప్రతి కుటుంబానికీ పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందాయన్నారు. అనంతరం విడపనకల్లులో భారీ జనసందోహంతో ర్యాలీ వెళ్లి బస్టాండు, బీసీ,ఎస్సీ,ముస్లిం,కురుబ కాలనీలో రోడ్డు షో నిర్వహించారు. అనంతరం స్థానిక బస్టాండు వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రణయ్‌రెడ్డి మాట్లాడారు. పదవి ఉన్నా లేకున్నా నియోజకవవర్గ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమించే విశ్వేశ్వరరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. త్వరలో జరిగే ఎన్నికల్లో పార్ట్‌టైం ఎమ్మెల్యే కేశవ్‌ను సాగనంపుదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పుష్పావతి, భరత్‌రెడ్డి, జెడ్పీటీసీ హనుమంతు, పార్టీ కన్వీనర్ బసన్న,మాజీ సర్పంచు కరణం భీంరెడ్డి, దేశాయ్ చంద్రనాథ్, దేశాయ్ సిద్ధార్థ, రోజా, మోదుపల్లి రామాంజనేయులు,రామాంజనరెడ్డి, కాకా తిమ్మరాజు, ఓబుళేసు, సుంకన్న, కురుబ గిరిబాబు, కురుబ రమేష్, హంపయ్య, ప్రసాదు, నాగరాజు, గోనుగుంట్ల గోపాల్, యువరాజు, ఉలిగన్న, మేకల రామాంజనేయులు, ఓబుళప్ప, ప్రకాష్‌గౌడు, జగన్, వడ్డే మల్లికార్జున, వడ్డే రామాంజినేయులు, వడ్డే హంపయ్య, రఘురాం, ఎల్లప్ప, ధనారాజు, మహేశ్, శీనాస్వామి, వీరప్ప, ఉమాశంకర్, ప్రసాదు, అశోక్‌రెడ్డి, హేమంత్ సునీల్‌రెడ్డి రఘు, బోయ నాగేంద్ర, బోయ రాజశేఖర్, గోవప్ప, జనార్ధనరెడ్డి, కేశన్న, మురళి మోహన్‌బాబు, కురుబ రమేష్, గోపాల్, దేవారాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు కూడేరులో ప్రణయ్ రెడ్డి ప్రచారం

కూడేరు: వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాయలసీమ జోనల్ ఇన్‌చార్జ్ వై. ప్రణయ్‌రెడ్డి శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు కూడేరులో ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం చేయనున్నట్లు ఎంపీపీ నారాయణరెడ్డి తెలిపారు.

రైతు పక్షపాతి సీఎం జగన్

గుత్తి రూరల్: రాష్ట్రంలో 10,500 రైతు భరోసా కేంద్రాలు, 175 అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లు నిర్మించి, వ్యవసాయానికి రూ.1.84.567 కోట్లు ఖర్చు చేసి సీఎం జగన్ రైతు పక్షపాతిగా నిలిచారని వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు వై.రాజశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఇసురాళ్లపల్లిలో జరిగిన సమావేశంలో సీఎం జగన్ ప్రభుత్వంలో రైతులకు జరిగిన లబ్ధిని ఆయన వివరించారు. సీఎం జగన్ ఐదేళ్లలో వ్యవసాయాభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. వ్యవసాయానికి తొమ్మిది గంటల ఉచిత విద్యుత్ అందించారన్నారు. గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు నిర్మించి రైతులకు గ్రామాల్లోనే విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు, నేల సామర్థ్య పరీక్షలు చేసి అనేక రకాలుగా సేవలు అందించారన్నారు. రూ.3వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి, రూ.2వేల కోట్లతో ప్రకృతి విపత్తుల సహాయ నిధిని ఏర్పాటు చేశారన్నారు. సీఎం జగన్‌కు ఎన్నికల్లో రైతులు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పుల్లారెడ్డి, మహాలింగ, గోపాల్‌రెడ్డి, శేషారెడ్డి, మల్లికార్జున, హరినాథ్ పాల్గొన్నారు.

ఊరూరా విస్తృత ప్రచారం

వజ్రకరూరు: మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు గురువారం సాయంత్రం ప్రచారం చేశారు. గరుసగడ్డ, నాగులబావివీధి, బెస్తవారివీధి, బలిజవీధి, కురుబ కాలనీ తదితర ప్రాంతాల్లో ప్రచారం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సోమశేఖర్‌రెడ్డి, మోనాలి సా, ఉస్మాన్, రామానాయుడు, రవికాంతరెడ్డి, నల్ల బోతులరాజు, అచ్చనాల మధుసూదన్, రాకెట్ల బా బు, నెట్టికల్లు, వెంకటేశ్వరరెడ్డి, ప్రభుదాస్, రమేష్, బెస్త ఆది, జిరాక్సు శివ, సునిల్, భూమన్న పాల్గొన్నా రు.

బెళుగుప్పలో..

బెళుగుప్ప: మండల కేంద్రంలోని వినాయక నగర్, అంబేడ్కర్ కాలనీల్లో సహకార సంఘం అధ్యక్షుడు శివలింగప్ప, పార్టీ ప్రచార కమిటీ జిల్లా ఉపాధ్యక్షులు పాటిల్ నాగిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాస్ గురువారం ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి ఎమ్మెల్యే అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డి, ఎంపీ అభ్యర్థి శంకరనారాయణను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రామేశ్వరరెడ్డి, పాతన్న, ఈశ్వర్, కరుణాకర్, శీనానాయక్, తిప్పేస్వామినాయక్, గురుమూర్తిరెడ్డి, నరసింహారెడ్డి, పెద్దన్న, కిశోర్, సుంకానాయక్, గోవిందునాయక్ పాల్గొన్నారు.

ప్రచారంలో వైఎస్సార్‌సీపీ దూకుడు

పామిడి: పట్టణంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ప్రచారం దూసుకుపోతోంది. గురువారం పట్టణ కన్వీనర్ జోజోడే కుమార్, ఎంపీపీ భోగాతి మురళీమోహన్ రెడ్డి, కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎల్ మధుసూధన్‌రెడ్డి, గుత్తి మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ పెమ్మక చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో బృందాలుగా ఏర్పడి ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తున్నారు. ఎమ్మెల్యేగా వై.వెంకట్రామిరెడ్డి, ఎంపీగా శంకరనారాయణను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్కలూరు దిలీప్‌రెడ్డి, నాయకులు ఆర్‌సీ వెంకట్రామిరెడ్డి, చీమల నగేష్, జీ రాజశేఖర్‌రావు, శివారెడ్డి, గౌస్, ఖాజామోద్దీన్, రహీమ్, జాకీర్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల ప్రచారం

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌లోని 22, 25వ వార్డుల్లో గురువారం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. గుత్తి ఇన్‌చార్జ్ శ్రీనివాసరెడ్డి, కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మంజునాథ్ రెడ్డి, జిల్లా నాయకుడు రాజ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ సారథి వైఎస్ జగన్‌ను మరోసారి సీఎంను చేసుకుందామన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గుంతకల్లు ఎమ్మెల్యేగా వెంకటరామిరెడ్డి, ఎంపీగా శంకరనారాయణను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ సభ్యుడు ప్రవీణ్‌కుమార్ రెడ్డి, పార్టీ పట్టణ, మండల కన్వీనర్లు పీరా, గోవర్ధన్ రెడ్డి, పట్టణ, మండల సచివాలయ కన్వీనర్లు రంగస్వామి, సుభాష్‌రెడ్డి, నాయకులు మధుసూదన్ రెడ్డి, గురుప్రసాద్‌యాదవ్, రంగప్రసాద్‌రాయల్, సీవీ రంగారెడ్డి, విశ్వనాథ్ రెడ్డి, శామ్యూల్, జీఎం బాషా, గాలీబ్, వెంకీ, శేషు, గద్దల నాగేంద్ర, ఆటో నాగరాజు, ఈరన్న, అన్వర్, లాలు తదితరులు పాల్గొన్నారు.

దళితులంతా వైఎస్సార్‌సీపీతోనే

ఉరవకొండ: దళితులంతా వైఎస్సార్‌సీపీతోనే ఉంటారని పార్టీ పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు, మేజర్ పంచాయతీ సర్పంచ్ లలితమ్మ తెలిపారు. గురువారం ఎస్సీ కాలనీలోని మూగబసవన్న కట్ట నుంచి భారీ ర్యాలీ చేశారు.

పీసీ ప్యాపిలిలో టీడీపీకి ఎదురుదెబ్బ


పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వేశ్వరరెడ్డి

వజ్రకరూరు: మండలంలోని పీసీ ప్యాపిలిలో టీడీపీకి ఎదురుదెబ్బ తగిలింది. గురువారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పీసీ ప్యాపిలికి చెందిన టీడీపీ నాయకులు కె.సురేష్, కె.చిదంబరయ్య, కె.వన్నూరుస్వామి, డి.మాబాషా, కె.మనోజ్ తోపాటు మరో 25 మంది వైఎస్సార్‌సీపీలో చేరారు.వీరికి విశ్వేశ్వరరెడ్డి కండువాలు వేసి, పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పీసీ ప్యాపిలి నాయకులు రమేష్, చంద్రానాయక్,కిష్టప్ప,అర్జున్, మాబుసాబ్, విజయ్‌కుమార్‌నాయక్, భీమా, ప్యాపిలి వీరా పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి: డీఎస్పీ

వజ్రకరూరు: ప్రశాంత ఎన్నికలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని గుంతకల్లు డీఎస్పీ శివభాస్కర్ కోరారు. గురువారం సాయంత్రం కొనకొండ్ల గ్రామంలో గుంతకల్లు డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి పర్యటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు, పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా ప్రజలు సహకరించాలన్నారు. ఎన్నికల్లో ఎక్కడైనా అల్లర్లు జరిగినా, వాటిని ప్రోత్సహించినా చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఉరవకొండ సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ నరేష్, పోలీసులు పాల్గొన్నారు.

80 శాతం పింఛన్ పంపిణీ

కూడేరు: సామాజిక భద్రతా పింఛన్ల నగదు పంపిణీ గురువారం నాటికి 80 శాతం పూర్తయినట్లు ఎంపీడీఓ ముస్తఫా కమల్ బాషా తెలిపారు. మండల వ్యాప్తంగా మొత్తం పింఛన్‌దారులు 5,723 మందికి గాను రూ.1.70 కోట్లు మంజూరైందన్నారు. అందులో 1,696 మందికి ఇంటి వద్దకే వెళ్లి నగదును సచివాలయ సిబ్బంది అందజేస్తారు. మిగిలిని 4,027 మందికి వారి బ్యాంక్ ఖాతాల్లోకి జమ చేసినట్లు ఆయన తెలిపారు.

నేడు విద్యుత్ లైన్ మరమ్మతులు

విడపనకల్లు: మండలంలోని మాళాపురం, విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని ఉన్న 11 కేవీ,33 కేవీ లైన్లు మరమ్మతులు చేస్తుండడంతో మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ సత్యం ఓ ప్రకటనలో తెలిపారు. గుంతకల్లు నుంచి మాళాపురం విద్యుత్ సబ్ స్టేషన్‌కు సరఫరా అయ్యే 33 కేవీ లైన్లు కూడా విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.